# తల్లీకూతుళ్లు

" అడివిపందులు సేని మేసిస్తే, ఊరపందుల చెవులుగోస్సారట, అలగుంది, గండల తిత్తవ. సారావొండిన పెద్దమనుసుల్ని వొదిలీసి, మా యిళ్ల మీద బడతారేటి గండలు...?" గడ్డెమ్మ, గొంతు సాగదీసి అరుస్తోంది. ఇందిరా నగర్ కాలనీ, యీ చివరి యింట్లో, మంచమ్మీద నిద్రిస్తోన్న గవిరికి వినబడ్డాయి, ఆ అరుపులు!

నాగావళి నది ఒడ్డున ఊరు. ఊరికి ఉత్తరాన, స్మశానానికి కూతవేటు దూరంలో వుంది ఇందిరానగర్ కాలనీ ! ఊరికీ, కాలనీకీ మధ్య.... సంత తోట.

కప్పుకున్న కోకగుడ్డ కూడదీసి, లేచి, మంచమ్మీద కూర్చుంది గవిరి.

"... ఆళ సేతులు పడిపోను. కుండా మండలు యిసిరీసినారు. ఆళ కాళిరిగిపోను, గెంజి దాకలనేనా సూడలేదు. ఆల గతులు.... నిర్ గతులయిపోను, యిల్లు కల్లం జేస్సారు..."

గడ్డెమ్మ శాపనార్థాలతో సంగతేమిటో బోధపడింది గవిరికి.

వారానికో, పది రోజులకో పగలో, రాత్రో ఎక్సయిజు పోలీసులు రావటం, ఇందిరానగర్ కాలనీలోని కొన్ని యిళ్ల మీద బడి వంట సారా కోసం వెదకటం- మద్యనిషేధ చట్టం వచ్చేక జరుగుతోన్న తతంగం.

గవిరి కప్పుకున్న కోకగుడ్డ తొలగించి, మంచమ్మించి లేచింది. వీధిలోకి వొచ్చి, ఆకాశంలోకి చూసింది. రాత్రి .... ఆకాశంలోని చుక్కలను, పగలు ... సూర్యుని చలన దిశను గమనించి ... వేళను అంచనా కట్టగలదు గవిరి. ఇంకా బోల్డు యేళుంది." అను కుంటూ వీధిలో చీకటి మూలకు.. కాళ్లు మడుచుకోడానికి వెళ్లి ,తిరిగి వచ్చి మంచమ్మీద వాలింది. కప్పుకున్న కోకగుడ్డలో యిమిడిపోతూ, యియ్యాల పెందలే లెగిసి పోవాల అనుకుంది.

కొంతసేపటికి నిద్రలో బెదిరిన చంటిపిల్లాడిలా ... కాలనీ యీ చివరి ట్విన్ లోంచి కోడిపుంజు కొక్కొరోకో అని కూసింది రెక్కలు గొట్టుకుంటూ. ఆ కూతకు మిగిలిన ట్విన్‌లలోని కోళ్లు గొంతులు కలిపాయి. ఊరిలోని కోళ్లకూ విన్పించిందేమో అవీ గొంతుల్ని వంత గలిపేయి. గవిరి గాభరాగా లేచింది. మంచం తలవేపు దండిమీద పెట్టిన అగ్గిపెట్టె తీసి వంటపంచ గూటిలోని దీపం బుడ్డీ వెలిగించింది. గిన్నె ముంతలూ, దాకలూ దోకెలూ తీసి పెరటి గోలెం దగ్గర నీళ్ళతో కడుగు తుంటే-

"గవురప్పా... యేళ పొద్దున లెగిసిపోనావు, కొండగ్గాని యెల్తావేటి?" అనడిగింది, పొరుగింటి తవిటమ్మ.

"... కొండకో, పెండికో యెళ్ళకపోతే... దినం తీర్తాదా నాకు? నీకంతే - పోషించే కొడుకున్నాడు. కోడలా పెడదాయికాదు. నీ అద్రుష్టం.... అందరికొస్తాదా?" మాట్లాడుతూనే, గిన్నెల్ని దోమీ, కడిగీ... నీళ్లు దులపసాగింది గవిరి.

"నీకు మాత్రమేమీ ? మా మరిది ఉన్నన్నాళ్లు ....నాయురాళ్లకి తీసిపోకండా నీకు జరపలేదా? " తవిటమ్మ గవిరి గతాన్ని కదపబోయింది.

గవిరి పాత్రల్ని తీసుకొని, వంటపంచలో ఒక మూల దొంతర్లుగా పెట్టి, మూలనున్న చీపురు అందుకుంది. ఇల్లు - మూల మూలలు తుడుస్తూ... భర్త జ్ఞాపకాల్లోకి వెళ్ళింది గవిరి. తమ మాటకాదని,పేదవాడ్ని పెళ్లి జేసుకున్నందుకు తల్లిదండ్రులు గవిరిని వెలివేసినా పీసమెత్తు లోటు రాకుండా చూసుకున్నాడు భర్త . గంప బట్టుకొని ఊర్లోకి గానీ, చేట బట్టుకొని యిరుగూ, పొరుగుకు గానీ... వెళ్లే పరిస్థితి రానీయలేదు. ముగ్గురు బిడ్డల తల్లి అయింది. కూతుళ్ల బతుకులే... గతుకుల పాలయినాయి.

చీపురు గోడలకు గీరుకుంది. గవిరి ఆలోచన లాగినాయి. రబ్బరు ముంతతో నీళ్లు పట్టుకొని, కాలనీ బయటి బయలు భూమికి వెళ్లింది. అటునుంచి వొచ్చినపుడు. దోవలోని తుమ్మికచెట్టు రెమ్మనివిరిచి, పలకర్ర పుల్ల జేసి నోట్లో పెట్టుకుంది.

ఇంట్లోకి వెళ్లి, ఇత్తడి బిందెలు రెండు చెరో చేతా పట్టుకొని బోరింగ్ కాడకి వెళ్లింది. అక్కడే, ముఖం కడిగి బోరింగ్ పంప్‌కొట్టింది.

".... ఎవులే ? తెల్లారిందే అప్పుడే? బోరింగ్ మీద పడిపోనారు? " బొమ్మాలి బోడియ్య... మంచమ్మీంచే కేకేసాడు.

"".... లేదుర్నాయినా, తెల్లార్లేదు. తొంగోరా నాయినా, తొంగో... పొద్దుకి తిన్నగ కడుపు ఆరేసుకొని తొంగో. తెల్లార్లేదింకా ..." అని బదులు చెప్పి బిందె మోసుకువెళ్లింది గవిరి.

గవిరికి తొందరగా వుంది.. కొండ కెల్లాల

తల చిక్కులు విప్పలేక, శిగలాగ వెనక్కి చుట్టేసి, జుత్తు ముడేసుకుంది. కట్టుకున్న కోక నడుము సరిజేసి, అంచులు సర్దుకుంది. ఇంటిలో ఓమూల దాచిన గంపను తీసింది.

ఆ గంపలో - చిన్న డబ్బాలో ఎరుపు కుంకుమ, మరో చిన్న డబ్బాలో నీలం కుంకుమా వున్నాయి.

గవిరి నుదుటి మీద మాత్రం కుంకుమ బొట్టులేదు. నీలంగా పచ్చబొట్టు వుంది. గంపలో మరోవైపు చిన్న కొబ్బరి దొప్పలో రాయగడ మజ్జి గయిరమ్మ తల్లి ... సిందూరం వుంది. గంపలో మరోమూలకి పూసల సేర్లూ, పిన్నీసులూ, రిబ్బన్లూ వున్నాయి. వాటి క్రిందను గాజుల దండలు జాగ్రత్తగా సర్దింది.

గవిరి మెడలోని నల్లపూసల సేరు... నల్లగా, మురికిగా వుంది. ముక్కుకి కుడివేపు నత్తు పెట్టుకునే రంధ్రంలో యీనెపుల్ల దోపివుంది. చెవి తమ్మిలు రంధ్రాల్తో నిర్జీవంగా కిందకి వేలాడుతున్నాయి.

గంప అంతా సర్దుకొని, కొంచెం ఖాళీ స్థలం చేసి అందులో చిన్న తపేలాతో గెంజన్నం పెట్టింది. మూలనున్న గుడ్డ తీసి, సుంపాత చుట్టింది. గంపనెత్తి మీద కెత్తు కొని, సుంపాత సర్దుకుని ముంజూరు గడప దాటింది. చీకట్లు, మెల్ల మెల్లగా తొలగిపోయేయి. గవిరికి దాసు యెదురొచ్చేడు. గవిరి ఆగిపోయింది. చీకటి తొలగే ఆ వేళ, దాసు నిల్చున్న చింతమానులా వున్నాడు.

".... ఈ పొద్దుతేల్చవా ? కాదూ, నీ ఉద్దేశమేటి ?" దాసు కంఠం చించుకు అడిగేడు.

గవిరి తటపటాయించింది. ఏం చెప్పాలో అర్థం కాలేదామెకి. తనేం తేల్చగలదు?మౌనంగా దాసుని వొసిలించుకు వెళిపోబోయింది. దోవకు అడ్డంగా నిల్చున్నాడు దాసు -

"... రేపు ఆకరి రోజట. నామాటిను నువ్వు ఆగిపో. సరస్వతిని తీసుకొని యింటి కొచ్చెయ్యి..." ఎంత తేలిగ్గా చెప్పేసాడు!

సరస్వత్తో యీ విషయాలే మాట్లాడలేదు. దాని, ఆలోచన లెలాగున్నాయో...? గవిరి ఆలోచిస్తోంది.

"పిల్లల్ని చూసే ఆడదిక్కులేదు. నా పిల్లలకి తల్లిగా నాయింటికి రమ్మను..." దాసు, బ్రతిమాలే ధోరణిలో..

"పిల్లల్ని... నాకాడ వొదిలీ.." గవిరి, ముక్తసరిగా..

"నీకాడ వొదిలీస్తే ... మరి సెప్పకు. ఆళు పందుల్తోటి తిరుగుతారు నువ్విలగ కొండా, పెండిల కెళిపోతే.." దాసులో అసహనం ప్రవేశిస్తోంది.

"..... కొండా, పెండీ అనప్పొతే.. నా బతుకో?"

".... మీ బతుక్కి నాది పూచీ. సరస్వత్తోటి సెప్పు.. మీరు గడప దిగక్కర్లేదు. సరస్వతిని సర్పంచ్ చేస్తాను..."

గవిరి, తృణీకారంగా చూసింది.

".... నా మీద మీకు అభిమానం లేపోతే లేదు. నీకూతురు పిల్లలు గారా...నాపిల్లలు? ఆళ్ల మీదైనా అభిమానం వుండొద్దా? నీది గుండే రాతి బండా?" రొక్కించేడు దాసు.

గవిరి మనసులో .. పెద్దకూతురు జ్ఞాపకాలు కదిలేయి. దీర్ఘంగా నిట్టూర్చింది. తర్వాత, యేదో నిశ్చయానికి వొచ్చిన దానిలా.. దాసుని దాటించి, దోవతీసింది మౌనంగా.

"...అయితిదిగో, ఇదినుకో, ఇదిగిదే ఆఖరు. ఇక, మీకూ ... నాకూ సరే. చుట్టరికాలు, బంధుత్వాలు తెగిపోయినట్టగే.. ఆఁ " ఆవేశంగా కేకలేయ సాగేడు దాసు. కండరాల్తో బలిసిన మెడనరాలు పొంగి, ఉబ్బెత్తుగా కన్పిస్తోంది దాసు గొంతు.

దాసు కేకలకు కాలనీలో, పెందలాడే లేచిన వాళ్లు.. వచ్చి చేరారు. వాళ్లను దాటుకుంటూ గవిరి-

" తెగిపోయినివి తెగిపోతాయి, కలిసినివి కలుస్తాయి. తెగిపోతాయి, తెగిపోతాయి అని తాటిస్తే.. బయ్యిమేటినాకు?" అని జవాబిచ్చి వెళిపోయింది.

"... ఇదెప్పుడూ యింతే. అందరూ.. నందంతే... యిదేమో పంది అంతాది. దీని తిత్తవ నాకు ముందునుంచీ తెల్సు. మీకు తెల్దు" అన్నాడు. గవిరివైపు చూస్తూ.. కేకలు విని వస్తోన్న రేగాన క్రిరి ముసిలోడు. కళ్లు పులుముకొని, గొంతు సవరించుకొని యింకేదో చెప్పటానికి దాసువైపు రాబోతే మధ్యలోంచి అడ్డంగా రెండు పందులు..వొకదాని వీపు మరొకటిరాసుకుంటూ పరుగెత్తాయి. పందులు వెళిపోయేక, క్రిరిముసిలోడు రెండడుగులు నడిచివచ్చి-

"..... నీ యత్త గొప్ప మొండి పట్టుమనిషి .ఉడుం అనీ వోలిమి దాన్ని. అలాటి దాయిగా బట్టే యీ పేటొచ్చింది. ఈ పేటల వుండవొల్సిన దాయేటి? ఈ గంపనెత్తిన బెట్టి తిరగాల్సినదాయేటి ? దాని కన్నోరు. యెలాంటోళు ? డాబా, గీబాలు, యిళ్లూ, చెప్పుల కంపినీ బిగినీసులు , వోహో వైబోగం మీద వున్నోళ్లు అవన్నీ వొదులుకొని వొచ్చీసినాది నీ మామ కోసం. " చెప్పసాగేడు దాసుతో.

ఇంతలో కప్పుకున్న కోక గెంటు సర్దుకుంటూ "... ఆ, ఝామునుంచీ సలిసంపేస్తంది . రెబ్బకొండ గాలి కొట్టేస్తంది. ఆరిగెం లోని అగ్గిరవ్వ ఆరిపోనాది ... సుట్ట ముక్క అంటింది గాదు. నాయినా దాసూ అగ్గిపెట్టి గాని వుందేటి?" అడిగేడు జమ్మయ్య.

దాసు అగ్గిపెట్టియిచ్చేడు. కర్రి ముసిలోడు కొనసాగించేడు.

"... నీకీ భోగట్టాలేవీ తెలవ్వు. నువ్వపుడుకి యీ ఊరే రాలేదు గదా ? అవునూ నువ్వీ ఊరొచ్చి యిరవై పంటలవుతాదేటి?" అని అడిగేడు దాసుని.

ఆ మాటకు, జమ్మయ్య, అందుకొని -

"యేలవదూ? అవుతాది. మనూరి పంచాయితీకి, రొండో ఎలక్సన్ టయిముకి .. మూడునెల్లు ముందొచ్చాడు. నాకు బాగా గుర్తు. ఈడి మూలానే గదా.. పెద్ద తగువైంది ఎలక్సన్నాడు? ఈడికి ఓటు హక్కులేదని.. కొందరూ , ఉన్నాదని కొందరూ తగువుకి మొగిసిపోనారు. ఆ పొద్దు... కూనీలయిపోను. ఈడికి పిల్ల నిచ్చిన మామ సచ్చి యేలోకాన వున్నాడో గానీ ఆడుగదా... ప్రెళయాన్ని ఆపినాడు..."

పాతికేళ్లనాటి, గ్రామ పంచాయితీ రాజకీయాల ఘర్షణను గుర్తు జేసాడు.

ఆ నాటికి ఇందిరానగర్ కాలనీలేదు. మూడువాసల .. మాలపేట వుండేది. ఊరికీ, మాలపేటకీ మధ్య.. యిప్పటి మామిడితోట వుండేదిగానీ ... సంత జరిగేది కాదు. ఆ మామిడి తోటను కాపుగాసుకుంటూ కూలీనాలీ చేసుకొంటూ పెద్ద జమ్మయ్య బతికేవాడు. పెద్ద జమ్మయ్యకి.. ఇద్దరు కూతుళ్ళూ, తర్వాత కొడుకూ సంతానం. ఆ కొడుక్కి గూడా జమ్మయ్య అనే పేరు పెట్టారు. అయితే, తండ్రీ కొడుకుల్ని పెద్దజమ్మడు ,చిన్నజమ్మడు అని పిల్చేవారు ఊరివాళ్లు.

చిన్నజమ్మడు ఎదిగొచ్చే వయసుకి.. మాలపేట.. మరి నాలుగు వాసలకి యెదిగింది. పెద్ద జమ్మడు పెంచి, పోషించిన మామిడితోట కొన్ని చెట్లు కోల్పోయి సంతతోట అయ్యింది. ఆదివారాలు..... అక్కడ సంతలు ఆరంభమయ్యేయి.

చిన్నజమ్మడు సాముగరిడీల్లో ఆరితేరినవాడు. ఊరిలో యే సంబరం జరిగినా, పెద్ద జమ్మడి డప్పూ ,చిన్నజమ్మడి గరిడీ తప్పని సరిగా వుండేది. మాలపేట యువకులు మరి కొందరు.. చిన్న జమ్మడి శిష్యులయ్యేరు. సంగిడీలు యెత్తటం, బరువు బండ్లు లాగటం, ఎడ్లపందేలు, యివే చిన్న జమ్మడి రంగాలు . చుట్టూ పదూళ్ల కి చిన్నజమ్మడు తిరుగులేని వస్తాదు.

ఓ సారి చిన్నజమ్మడి బృందం... రాయఘడ దగ్గిరి తెరవలి గ్రామదేవత పండుగకు గరిడీ కోసం వెళ్ళింది. ఆ ఊరి ప్రజల మన్ననలు పొందింది. గరిడీలో చిన్నజమ్మడి కర్రసాము ప్రత్యేక ప్రశంసలందుకొంది. చిన్న జమ్మడు కర్రసాముతిప్పితే ప్రత్యర్థుల కర్రలు తుళ్లిపోయావి. రాల్లు విసిరితే తిరిగొచ్చి విసిరే వాళకే తగిలేవి. శబాసో అన్నారు చూసినోళ్లు. తెరవలి నాయుడు బాబయితే కొత్త పంచెల సాపూ, పది రూపాయిల నోటూ బహుమాన మిచ్చేడు చిన్నజమ్మడికి.

అదిగో, ఆ గరిడీ చూసింది గవిరి.చిన్నజమ్మడి మీద మనసుపడింది. చిన్నజమ్మడి తోటే తన మనువు అని నిర్ణయించుకుంది. తల్లిదండ్రులు యెంత బ్రతిమాలినా వినలేదు. ఆఖరికి, వారి గడప యెక్కనివ్వం అని హెచ్చరించినా ఖాతరు చేయలేదు. తిన్నగా, యీ పేట వచ్చేసింది. దూరపు చుట్టం బొమ్మాలి పైడమ్మ యింటికి చేరింది. ఆమె ద్వారా రాయబారాలు నడిపి చిన్నజమ్మడి భార్య అయ్యింది. గవిరి ... ముగ్గురు బిడ్డల తల్లి అయ్యే నాటికి .... దాసు యీ ఊరొచ్చేడు. అప్పటికి మాలపేట చిన్నజమ్మడి మాట మీద నడిచేది.

కర్రిముసిలోడు. గతాన్ని కదిపి, గవిరి పట్టుదల...యెలాంటిదో వివరించేడు.

తొలిపొద్దు... ఎర్రగా వెలుగులు జల్లుతోంది. అందరూ పనీ, పాట్లకు కదుల్తున్నారు. ఇద్దరు కుర్రవాళ్లని వెంటతీసుకొని, దీపుడు దాసుకోసం వచ్చేడు.

".... నువ్వింకా యిక్కడే వున్నావా? ఆళంతా ... అక్కడ మన కోసం సూస్తారు గావాల ? మదు నాయుడు బాబు... కేక లెయ్యడా? " అన్నాడు దాసుతో.

దాసు, అక్కడ్నించి... యింటివైపు కదిలేడు.

"... అడగ్గాడదు గానీ, యెక్కడికర్రా బయిలెల్తన్రు...?" అనిదీపుడ్ని అడిగేడు కర్రి ముసిలోడు.

".... ఎక్కడికైతే నీకెందుకురా? అన్నిటికీ... అడ్డగ దూరిపోతావు. ఓల్డేజి పెన్సన్ శాంక్సనవడంవొల్ల... కొవ్వెక్కి పోతన్నావ్‌రా . కూకోనితిండం వల్ల." అంటూ దులిపేసాడు దీపుడు... వెళిపోతూ!

".... ఈడికి వొళ్లంతా యిరుకే. ఇలాటోల్ని యెనకాలతిప్పుకొని దాసుగోడు పెద్దపేరు మూటగట్టుకుంతండు. అల్లుడే గానీ, దాసుగోడికి, పదిజెన్మలెత్తినా.. ఆడిమామకొచ్చిన పేరు రాదు.." జమ్మయ్య... ముసిలోడ్ని సముదాయించే ధోరణిలో అన్నాడు.

"... దాసుగోడికేంరా నాయినా? ఆడిమామ లాటోల్లు... తపస్సు జేసినా కట్టగల్రేటి ? అలాంటి బిల్డింగు గట్టేడు. లక్ష్మీదేవిని చేతిల తిప్పుతండు. ఆడికేటి." యెందుకో కర్రిముసిలోడు దాసుని... తక్కువ జేసి మాట్లాడటాన్ని అంగీకరించలేక పోతున్నాడు.

"...పదవి చేతిలుంటే లక్ష్మీ దేవిని తిప్పడం వొకలక్కేటీ?" అప్పుడే అటువైపొచ్చిన, పాపారావు బదులిచ్చేడు.

"..రాజులు.. రాజా బిల్డింగులు గడితే, దాసుగాడు రోజ్‌గార్ బిల్డింగ్ గట్టేడు"
అని విశదీకరించేడు పాపారావు.

".. పదవుంతే... అందరూ కట్టేసేరేటి? మరి నువ్వేమీ.. యేటకో యెకరా అమ్మేసినావు? చెల్లని కాణీ అయిపోయి, చెడిపోనావేమీ?" కర్రి ముసిలోడు వాదనకి దిగేడు.

పాపారావుని అందరూ నామినేషన్ పాపారావు అంటారు. స్వాతంత్ర్య పోరాట యోధుడిగా తండ్రి సంపాదించిన .. అయిదెకరాల భూమినీ - ఒకసారి సర్పంచయ్యాక అయిదేళ్లలో అర్పేసాడు పాపారావు. తండ్రి కీర్తిని ఖర్చు చేసుకుంటూ ఎన్నికల పరమపద సోపానంలో నిచ్చెన లెక్కలని చూస్తాడు. పంచాయితీ నుండి, పార్లమెంటు దాకా జరిగే అన్ని ఎన్నికల్లోన పోటీ చేస్తాడు గుడివాడ పాపారావు. ఇండిపెండెంటు అభ్యర్థిగా .. వి.వి..గిరి గారి మీద పోటీ జేసాడోసారి లోక్‌సభ ఎన్నికల్లో.

".... మంచీ, చెడ్డే కొసకి మిగుల్తాయి, ఆస్తిపాస్తులు... చచ్చిన్నాడు మోసుకెళిపోము..." సమర్థించుకున్నాడు పాపారావు.

"మంచో,చెడ్డో..? అవిమాత్రం మోసుకెళ్ళ గలవేటి..? " కర్రి ముసిలోడు వొదలడం లేదు.

అంతలో జమ్మయ్యకియేదో గుర్తొచ్చి -

"... నాయినా పాపారావో, బేంకీ నుండి యేదో కాయిత మొచ్చింది. సదివించటంకి యెవుళు దొరకటం లేదు...." అన్నాడు.

"యేమీ? మీ చదువుల తల్లి, సరస్వతి కాడకి యెల్లలేక పోనావా ?" పాపారావు ప్రశ్నించాడు.

"..కత అంతా యినీసి, అయితే యింతకీ రాముడికి సీత యేమవుతా దనడిగేడట. నీలాటోడే . సరస్వతి తగువేగదా.. యీ అలికిడి .అ దాసుగోడు అళ్ళత్త మీద కేకలేసుకొని... యెలిపోనాడు గాదా?" అన్నాడు జమ్మయ్య.

పాపారావు కేమీ బోధపడలేదు.

"యింతకీ, యెందుకు  కేకలేసాడు దాసు?"

"యేమో? నీను అప్పుడికి రాలేదు. ఈ ముసిలోడున్నాడు. అడుగు.. యీడ్ని.." చెప్పాడు జమ్మయ్య.

పాపారావు... ముసిలోడివైపు చూసేడు.

".. యిలాపింటి దాసుల్ని పదూరోల్ని పాడవాజేసీ ( ఓడించీ ) గల్దు... గవిరి " క్రిమిసిలోడు, కొసా, మొదలూ గాని మాట చెప్పాడు.

".... ఇంతకీ దాసు యేటని కేకలేసేడు? ఆడి అత్త యేటన్నాది? సెప్పురా ముసిలోడా.." పాపారావు బ్రతిమాలేడు.

జమ్మయ్య బ్యాంకు వారి నోటీసు తేవటానికి యింటికి వెళ్లాడు.

"నాకు నువు అత్తవు గావు అన్నాడు దాసుగోడు. ఆ మాటకి, ఆడి అత్త అయితే నువ్వు నా అల్లుడివి కావు అన్నాది.." అనేసి, అక్కడ్నించి కదిలిపోబోయేడు క్రిి ముసిలోడు.

ఈ లోగా జమ్మయ్య, నోటీసుతెచ్చి, పాపారావుకి అందించి, చదివి చెప్పమన్నాడు.

పాపారావు నోటీస్ అందుకొని, చూస్తూ.

" .. పందుల పెంపకం పథకం కింద యిచ్చిన ఋణం వడ్డీతో పిల్లల్ని పెట్టేసి... మురిగిపోయింది. వారం రోజులలోగా తీర్చకపోతే.. కోర్టుకి యీడుస్తాం." చదివివిన్పించేడు.

"... కోర్టుకి, యీడుస్తారా ? పందుల్నా? ఈడినా?" ప్రశ్నించేడు క్రిి ముసిలోడు.

"..పందుల్నీడిస్తే.... గత్తమయినా వొస్తాది. ఈడ్ని, యీడిస్తే అదీ రాదు." అనేసి, పాపారావు.. అక్కడి నుంచి కదిలి పోయేడు.

" అయితిపుడేటి సెయ్యిడం? దీనికి దారేదిరా నాయినా?" అంటూ, పాపారావు వెంట బడ్డాడు జమ్మయ్య.

"...పాత అప్పులు తీరిపోతాయి పందుల్ని పెంచితే అంటారు.మరి, బేంకీ అప్పులు యేల తీరవో?" క్రిి ముసిలోడు ప్రశ్నించుకుంటూ, దేవర గంగరాజు టీ కొట్టువైపు నడిచేడు.

* * *

గవిరి, ఊరికి మైలు దూరానున్న రైలు రోడ్ దాటింది. 'కొండవలస' వెళ్లే దోవచేరింది. అప్పటికి...... సూర్య కిరణాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. దోవనిండా వెల్తురు పరుచుకుంది. దూరాన్నించి, రెబ్బకొండలు పచ్చగా పసుపూ కుంకుమల్తో ముస్తాబయిన జాకర దేవత విగ్రహాల్లా కన్పిస్తున్నాయి. దోవకి యిరుప్రక్కలా తుప్పలూ, డొంకలూ ఆకుల్ని అల్లాడిస్తూ.. గవిరిని పలుకరిస్తున్నాయి. తుమ్మిక చెట్ల మీది చిలుకలు రివ్రీ., రివ్రీ" అంటూ అరుస్తున్నాయి, గవిరి తల మీదుగా యెగురుతూ!

గవిరి .. వడి, వడిగా అడుగులు వేస్తోంది. చీపురువలస చేరింది. చీపురు వలస ప్రక్కగోర్జిలోంచి నడుస్తుంటే కర్రక సోమందొర కలిసేడు. భుజమ్మీది గొడ్డలి సర్దుకుంటూ -

" కొండొల సేనేటి?" అనడిగేడు.

"నువ్వో..?" జవాబుగా ప్రశ్నించింది గవిరి.

"... అల్లదిగాదా... ఆ మెట్టమీదకి. సాలపడిపోనాది. నాలుగురాటలు కొట్టితేవాల.." చెప్పాడు సోమందొర.

ఇద్దరూ, కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. అటునుంచి, కొండవలస నుంచి కోళ్లు నాలుగు సైకిల్ హేండిల్‌కి కట్టేసి, కేరేజికి జీలుగు సారా నింపిన డబ్బాతో యెదురయ్యేడు గంగరాజు. గంగరాజు వైపు ఈసడించుకుంటూ చూసి, సైకిల్‌కి దారిచ్చి ముందుకు నడిచేడు సోమందొర. ఆ తర్వాత, కొంతసేపటికి యెక్కడో నాటుతుపాకి పేలిన శబ్దం.

".. అప్పటికీ, యిప్పటికీ మా కొండలు మారలేదు. మాకు యిప్పటికీ జీలుగు కళ్ళూ... మిగల్చరు. పల్లపోడు నొల్లుకు పోడమే. ఆఖరికి, జెంతువులికీ దిక్కులేదు. అదిగోటి, అది జెంతువుని యేటాడిన తుపాకి శబ్దమే... " సోమందొర, మనసులో బాధను వ్యక్తం చేసాడు.

నిజమే ! గవిరి ఆలోచనలో పడింది. అప్పుడు తను యీకొండల్లోకి రాకపోయినా... యిక్కడి యుద్ధం గురించి విన్నాది. ఇప్పుడు వలసల్ని చూస్తోంది. మార్పేమీ కనబడలేదు.

".. నీనీ దోవలెల్లి మెట్ట మీద కెల్తాను. నువ్విక యెళ్లయితే.." అని చెప్పి ప్రక్కదారి లోకి నడిచిన సోమందొర, ఆగీ, నిలబడి-

ఔనప్పా..? దాసు మీ యల్లుడేనట గదా?" అనడిగేడు.

ఔనంది గవిరి.

"... కొండొలస భూమి తగువుల బుచ్చిదొరకి సపోరుటు జేస్తన్నాడట? కొండోడు సంతలకీ, పల్లానికీ రాగలడేటీ అంటండట? అతగాడికెందుకీ గొడవలు. " సోమందొర, దాసుగురించి విన్నవన్నీ అడిగేడు.

గవిరి బదులు చెప్పలేదు.

".. గోవొర్ధన నాయుడి కొడుకట గదా.... యీల్లకి లీడరు? ఆ మద్దెన అన్నలు వొచ్చినపుడు. యివన్నీ చర్చించినాం.." అన్నాడు సోమన్న దొర.

గవిరి ఆలోచిస్తోంది. దాసు తమఅల్లుడే గానీ, యెన్నడూ తమవాడుగా ... అన్పించ లేదు. ఎప్పుడూ పరాయి తనమే కన్పించేది. ఇప్పుడు గానీ దాసు తమకు దగ్గర అవదలచేడా ? అందుకనేనా, సరస్వతిని కోరుకుంటున్నాడు? గవిరి ఆలోచనలు తెగటం లేదు.

" అల్లుడే గదా, కసింత, జేగర్త సెప్పు.." గవిరి వైపు చూస్తూ, హెచ్చరిక జేసి, తన దోవన వెళిపోయేడు సోమం దొర...........

"... నువ్వు లచ్చసెప్పు నాను యినను. నీకేటి తెల్సు..? నిన్నగాకమొన్న యీ ఊరొచ్చేవు. రామ్మూర్తి నాయుడికి యెతిరేకంగా యీ పేటల పిట్టమనిషి వుండడంకి వీల్లేదు. శీరామ చెంద్రుడే.. రామ్మూర్తి నాయుడు. అతగాని తోటలంటా, దొడ్లంటా బతికి నోళిమి. అతగాన్ని కాదన్టమా? బుద్ధీ, గ్యేనం వుందా నీకు?" దాసు మీద కేకలేసాడు గవిరి భర్త .

గవిరికి.. అన్ని ఘర్షణలూ గుర్తున్నాయి. కూతురుతో ఘర్షణపడి.. చివరికి కూతురి అభీష్టాన్ని కాదనలేక దాసుకే యిచ్చి పెళ్లిజేసారు. అల్లుడయ్యాక, దాసు మాలపేట లో చీలిక దెచ్చాడు. అది భరించలేక కేకలేసాడు గవిరి భర్త.

దాసూ తగ్గలేదు అయితే, ఆవేశంగా కేకలెయ్యకుండా తెలివిగా వాదిస్తున్నాడు-

"... ఏం బ్రతుకులు బ్రతికీసేరు? నాయుడోరి సాలల్లంట.. పశివి బతుకులు. పశివిలకీ, మనకీ తేడా యేటి జూసేరా నాయుళ్లు ? ఆళ్ల సాలల్ల, పెడకలకి గిన్నెలు దోపి వుంచీ వోళ్లా ? లేదా ? ఆ గిన్నెలు దీసి, గడపల బెడితే... నాయిరాళ్లమ్మలు అందల గెంజన్నం యెత్తి పోసీవోరు, నిజమా? అబద్దమా ?" కులవివక్షతతో ... యెలా నాయుళ్లు ప్రవర్తించేవారో యెత్తిపాడిచేడు దాసు.

"..అయితేటి? గోవర్ధన నాయుడు, అంటూ, ముట్టూ అనడా ? మాల, మాదిగలూ అని..యెంచడా? అందరి సంగతేల ?నువ్వు ఆళ్ళ బదవంతా సేస్తావు గదా ? నిన్ను ఆల్తోటి పాటు సమానంగ సూసెస్తండేటి? ఎవులయినా ... వొకటే ! గోవొర్ధన్నాయుడేటి.. గాంధీమహాత్ముడేటి? ఆ మాట కొస్తే... రామ్మూర్తినాయుడు, మమ్మల్ని కష్టాలపుడు కడుపుల దాచుకుంతాడు." గవిరి భర్త.

"... మీరెప్పుడు సూడ్లేదు.. అందికే నమ్మరు. గోవర్ధననాయుడు గారి.. నట్టింటిలోకి యెల్తుంటాన్నీను. నాయురాలికయితే కోడీ, గొర్రిపోతూ.. మాంసం కూరల నాడయితే - మాంసం కోసీ, తాళింపు గిన్నెకి అందిస్తాను. ఆళెప్పుడు .. అంటూ, ముట్టూ అన్లేదు " ఘనమైన విషయాల్లా చెప్పాడు దాసు.

వింటోన్న గవిరికి - దాసు చెప్పిన విషయాలు నచ్చేయి, గాని దాసు వాదించే తీరు.. నచ్చలేదు. అంటూ, ముట్టూ అనకుండా ఇంట్లోకి రానిచ్చినంత మాత్రాన - మంచోళ్లయిపోతారేటి ? ఎందుకో - గవిరికి.. తమ పేట జనం దాసు కోరిక ప్రకారం -గోవర్ధన నాయుడి పక్షం చేరితే.. మంచి జరుగుతుందని భావించలేకపోతోంది.

" .. నా మాట మీద నమ్మకం లేకపోతే - నువ్వేవొచ్చి సూడరాదేటి ఒకసారి?"యెలాగైనా, మామని గోవర్ధన నాయుడివైపుతిప్పాలన్న ఆరాటంలో వున్నాడు దాసు.

నిజమే. దాసు.. చెప్పింది. గోవర్ధన నాయుడు.. సాంప్రదాయ రైతు కాదు. దేశ కాల, మాన పరిస్థితుల్నీ, ప్రవేశిస్తోన్న మార్పుల్నీ, గ్రహించినవాడు. ఆ రోజుల్లో సెకండ్ ఫారం దాకా చదువుకున్నాడు. అప్పటికి.. ఆ ప్రాంతం జమీందారీ ప్రాంతం. జమీందారీ పెత్తనాన్ని సహించలేని రైతుల తిరుగుబాట్లు అక్కడక్కడా జరిగేవి. ఆనవరం, లక్ష్మీపురం, సాలూరు, కురుపాం ప్రాంతాల్లో యీ తిరుగుబాట్లు తలెత్తాయి. లక్ష్మీపురం, తిరుగుబాటు సందర్భంలో గోవర్ధన నాయుడు చుట్టరుకానికి వెళ్లి.. ఆ ఊరిలో వున్నాడు. ఆ తర్వాత, గోవర్ధన నాయుడు.... తిరిగి యింటికి రాలేదు. లక్ష్మీపురంలోనా లేడు. గొడవల్లో అరెస్టయి జైల్లో వున్నాడనీ, కాదు, కాదు, యేదో ముఠాలో కలిసి పోయేడనీ; అలాక్కాదు.. రాజకీయాలు వంటబట్టి.. దేశ పర్యటన చేస్తున్నాడనీ.. రకరకాలుగా అనుకునేవారు ఆ రోజుల్లో.

తొలి పంచాయితీ ఎన్నికలు జరుగిన నెల రోజులకు మళ్లీ తిరిగొచ్చేడు గోవర్ధన నాయుడు. డబ్బు బాగా సంపాదించి వొచ్చేడంటారు జనం. మనిషి మాత్రం... మంచి రూపమూ, తేజస్సూ

సంపాదించేడు. తెలుగే కాక, హిందీ, మరాఠి మాట్లాడటం గూడా నేర్చుకున్నాడు. ఊరిలో... కొందరికి అతడో ఆకర్షణా కేంద్రం కాగలిగేడు.

అప్పటిదాక, ఊరివారికి రామ్మూర్తినాయుడు ఆదర్శంగా కన్పించేవవాడు. అందుకే, తొలి పంచాయితీ సర్పంచ్‌గా రామ్మూర్తి నాయుడ్ని యేకగ్రీవంగా యెన్నుకున్నారు. గానీ, రెండో ఎన్నిక లొచ్చేసరికి ఊరిలో కొంత మార్పు వచ్చింది. గోవర్ధననాయుడు పోటీకి దిగేడు. ఆ ఎన్నికలకే.. దాసు ఊరు రావటం, దాసు ఓటు హక్కు మీద గొడవ జరగటం, గవిరి భర్త.. ఆ గొడవని ఆపటం జరిగింది.

మూడో ఎన్నికలనాటికి.. మాలపేట ఇందిరానగర్ కాలనీ అయ్యింది. దాసు గవిరి అల్లుడైనాడు. మామని యెలాగైనా గోవర్ధన నాయుడి పక్షం తిప్పాలన్న ఆరాటం వృధా కాగా. ఘర్షణకే దిగేడు దాసు. పంచాయితీ ఎన్నికల్లో కాలనీని., రెండు వర్గాలుగా విడదీసేడు. మామా, అత్తల్తో.. పలకరింపులు మానేసాడు. ఆ యింటికాకి యీ యింటి మీద వాలగూడదన్నాడు. కూతుర్నీ రానీయలేదు. గవిరికి ఘర్షణంతా గుర్తొస్తోంది..

"మొక్కనాడే వొంగలేదు మాను అయిపోనాడిక మరి, వొంగుతాడా? ఇంకిప్పుడే మని .. జేగర్తలు సెప్పను ? " అనుకుంది మనసులో . సోమందొర., అప్పటికే చాలా దూరం వెళిపోయేడు.

గవిరి, గతాన్నితల్చుకుని, నిట్టూర్చి, గబగబా అడుగులువేసింది.

అలవాటు ప్రకారంగా తిన్నగా కొండొలస జన్నోడి యింటికి నడిచింది గవిరి.

* * *

జన్నోడి యింటి ముందర రెండు నులక మంచాల మీద ఎవరో అధికార్లు కూర్చున్నారు. వారికి కొద్దిగా యెడంగా..నేల మీద వలస జనం కూర్చున్నారు. జన్నోడు నిలబడి, యేదో వివరిస్తున్నాడు.

గవిరి, నిశ్శబ్దంగా ... గంప దించుకొని, చేతుల్తో మోసుకొని జన్నోడి ముంజూరు గడపలోకి వెళ్ళింది. అక్కడ జన్నోడి భార్యా, యిరుగూ పొరుగు ఆడోళ్లూ, జన్నోడి కూతురు 'లాకి' వున్నారు.

"రికార్డులంట.. జన్ని పొలం అని వుంతాది; దున్నీవోడు మాత్రం జన్నోడు కాదు. మరలాటపుడు ఆ రికార్డులేల?" కోపంతో ఊగిపోతూ ప్రశ్నించేడు కార్తీక దొర.

జన్నోడు - యెంతగావివరించినా, అధికార్ల తీరులో మార్పు రానందుకు. కార్తీక దొరకు కోపమొచ్చింది.

"... దున్నీ వోడిదే భూమి అని మీరేగదోయ్ అంటున్నారు. " అనిహాస్యమాడేడు, ఆ ఫిర్కా వి.ఏ.ఓ.

".. అయితే, ఆ మాటే ఖాయపర్చీయండి. నాగలిపూసి, దున్నుకోమనండి కమ్మాదొరని. ఎంత దున్నుకుంతాడో.. అంతా వొదిలేస్తాం. అలాగే, మాముదున్నినభూమి .. మాకు వొదిలీయాల అంతే, అది ఖాయపర్చీయండి. " కార్తీకదొర సవాలే విసిరేడు.

వి.ఏ.ఓ. మరి ఆ సంభాషణని పొడిగించలేదు.

గవిరికి తోవలో సోమందొర చెప్పిన మాటలు గుర్తొచ్చేయి. ఈ భూమి తగువుల లోనే గావాల దాసు, కమ్మాదొర పక్షం కాసేడు మరి,యీ అధికార్లు ఎవులి పక్షమో ? అధికార్లవైపు చూసింది.

".. మీ పిర్కా భూముల రికార్డులన్నీ తిరకాసుగే వున్నాయయ్యా. అన్నీ చిక్కులే,విప్పలేక చస్తున్నాం " విసుగ్గా, ఓ అధికారి.

" ఆ తిరకాసులూ, చిక్కులూ, మీము పెట్టామేటి బావ్ ? మాకసలు, రికార్డులు ఊసే వుండీదిగాదు.." జనంకి ముందు కూర్చున్న దీసరి- నిలబడి చెప్పసాగేడు.

" ... రికారుడ్లు పుట్టక పూర్వమూ, యీ భూమి వుండీది. ఈ వొలసా వుండీది. ఈ భూమిని, యీ వొలస సాగుజేసేది..." దీసరి.

" ఔనౌను భూమి బట్టే రికార్డులు పుట్టేయి. రికార్డులవలన భూమి పుట్టదు గదా ? ఔనౌను.." వొప్పుకున్నాడో అధికారి.

"... తొలీత, యిదంతా పర్లాకిమిడి రాజావోరి యేలుబడిల వుండీదట. ఆ తరాత, కురపాం జమీందార్లు కొచ్చిందట. అయితే, మా మన్యం మాత్రం దేవుకోన దొరలకి .. యిచ్చేరట పర్లాకిమిడి రాజావోరు. దేవుకోన మన్యం దొరల మీదకి కురపాం జమీందార్లు యుద్ధంకి దిగీవోరట. జెమీ తగువులు తేలీవి గావు. అపుడు మళ్లీ పర్లాకిమిడి రాజావోరే సంధి జేయించారట. యీ యిరుపక్షాల వారికీ.

ఇదిగీ జన్నోడి తాత అప్పుడికి మా వొలసకి జన్నోడు. ఆ జన్నోడ్ని, ఓ రోజు సూరీడు దూరీ లోపలే, స్నాన, పానాదులు గావించి, పూజా పునస్కారాలు జేయించి - యీ పిర్కా తూర్పు మూలనుంచి తిన్నగా పడమటకి నడిపించేరట, సూరీడు గుంకేయేళ దాకా! జన్నోడు యెంత దవ్వ నడిచేడో... అంత యేరియా భూమి. వొకవాటా కింద, మళ్లా మర్నాడు పడమటకి పొద్దు వాలిందాకా నడిపించి, ఆ భూమి మరొక వాటా కిందా నిర్ణయించేరట. పడమరకి యిదిగో యీ వొలస యీ జన్నోడి పొలమూ మిగిలిపోనాయి, పొద్దు గుంకీసింది. దేవుకోన మన్నెపు దొరలు పడమటి వోటానీ యెంచుకున్నారు. మా వొలసనీ, భూమినీ, జన్నోడికి వొదిలీసినారు ఎవురి పెత్తనమూ లేదు. అదిగదే.. భూమి కొలతలతీరు ఆ రోజుల్ల. అప్పుడి కాంచి మీము యే రికార్డులూ యెరగం" దీసరి కూర్చున్నాడు.

"..జమీలూ, సంస్థానాలూ.. పోయేయి గదా? అపుడు దేవుకోన మన్యెం దొరలే.. యీ భూమిని అమ్మేసారేమో." యేదో ఒక కొర్రీవేయటం అలవాటైన అధికారి ప్రశ్నించేడు.

"... అమ్మటానికీ ఆళకి అధికార మెక్కడిది బావూ ?" అది జన్నోడి కొచ్చిన ఈనాం భూమి. కూర్చునే చెప్పాడు దీసరి.

" అసలుచట్టం వొప్పుకోదుగదా సార్..? 1917/70 లేండ్ రెగ్యులేషన్ యాక్టు ప్రకారం... గిరిజన ప్రాంత భూముల.. అమ్మకమూ, కొనుగోలూ నియంత్రించబడింది గదా ?" అనడిగేడు, ఆ వలసలో యేకోపాధ్యాయుడిగా పని చేస్తోన్న ఆరిక బాలరాజు.

అధికార్లు... అతనివైపు అనుమానంగా చూసేరు.

"ఇక్కడి సింగిల్ టీచర్ని సార్..." చెప్పాడు బాలరాజు.

అధికార్లలో స్థిమితం కలిగింది. ఆ వెంటనే, యీ అమాయక గిరిజన్లకు యేవేవో నూరిపోసి, యిటువంటి వాళ్లే చెడగొడ్తున్నారనే భావన కలిగి... ఆ ఉపాధ్యాయుని వైపు కోపంగా చూసేరు.

అధికార్లలో పెద్దాయన -

" మైండ్ యువర్ బిజినెస్. వాట్ ఆర్ యు థింకింగ్ ? ( నీవు... నీ వ్యవహారమునే మెదడులో వుంచుకొనుము. నీవు యేమి ఆలోచించుచున్నావు ?) ఆఫ్టరాల్, యు ఆర్ ఎ టీచర్, నాట్ ఎ ప్రీచర్,

( నీవు, ఒక ఉపాధ్యాయుడివి, ప్రబోధకుడివి కావు) డు యువర్ జాబ్. డోంట్ ఎన్టర్ యిన్టు అదర్ ఫీల్డ్ అండర్ స్టాండ్. ( నీ ఉద్యోగం నీవు చేయుము ఇతర రంగముల లోనికి ప్రవేశించకుము అర్థమైందా?) '' ఆంగ్ల భాషలో, ఆ అయ్యవార్ని సీరియస్‌గా హెచ్చరించేరు.

జన్నోడికి గానీ, దీసరికి గానీ, కార్తీక దొరకి గానీ అక్కడ కూర్చున్న వలస జనాలు యెవరికీ .. ఆ ఆంగ్ల హెచ్చరిక అర్థం కాలేదు.

హెచ్చరిక విన్నాక ఏకోపాధ్యాయుడు తల దించుకొని, మౌనంగా అక్కడినుంచి వెళిపోయేడు.

కార్తీక దొరకు, అప్పుడు అర్థమైంది. వెంటనే నిలబడి, వలస జనాల నుద్దేశించి-

"... ఈ ఆఫీసర్లు - మన గురువుని.. బాసల తిట్టేరు. అందికే, గురువు.. పల్లక యెళిపోతండు. ఈళ్లకి నిజెం పనికిరాదు. ఈళ్ల రికారుడ్లు అబద్దం. ఈళ ఆఫీసులు అబద్ధం. ఈల్లేటి తేలుత్తారు మన భూముల తగువు ? పదండి ... అని సవర భాషలో మాట్లాడి, భుజమ్మీది తువ్వాలుదులిపి, అక్కడనుండి వెళ్లిపోయేడు.

కార్తీక దొర., అలా మాట్లాడి వెళ్లిపోయేక కూర్చున్న జనం. ఒక్కొక్కరూ లేచి, వెళ్లిపోసాగేరు.

అధికార్లకు అప్పుడు అర్ధమైంది - కార్తీక దొర వెళిపోతూ తమకు వ్యతిరేకంగా సవర భాషలోయేదో మాట్లాడాడని.

అందరూ, వెళిపోగా - 'జన్నోడు' వొక్కడే మిగిలేడు.

అధికార్లకు యేంచేయాలో పాలు బోవటం లేదు. మైదానానికి ఆనించిన గిరిజన ప్రాంత భూముల వివాదాలు యిటీవల్ల మళ్లీ ఆరంభమయ్యేయి. అప్పట్లో ,వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం నాటి ఉద్యమకాలంలో-వాళ్ళరీతిలో వాళ్లు - భూ వివాదాల్ని పరిష్కరించేరు.

ఉద్యమాన్ని అణిచేసి- అక్కడ సంస్కరణలు ఆరంభించింది సర్కారు. ఆఫీసుల్నీ,అధికార్లనీ నియమించింది.

ఏది యేమైందో మళ్లీ భూవివాదాలు మొదలయ్యేయి. నక్సలైట్ల కదలికలూ మళ్లీ ఆరంభమయ్యేయి.

"..మా చేతుల్లో వున్నంతవరకూ నీకు న్యాయం చేస్తాం. తొందర పడవద్దు. గొడవలకి దిగవద్దు. చూస్తాం, ఫైళ్ళు పరిశీలించి పరిష్కరిస్తాం.." అని జన్నోడికి చెప్పి; మంచాల మీంచి లేచారు అధికార్లు. అపనమ్మకంగా.. వీడ్కోలు చెప్పాడు జన్నోడు.

అందరూ వెళ్ళిపోయేరు. గవిరి... అప్పట్నించీ ఆత్రంగా వుంది. గబగబా గడపలోంచి వొచ్చి-

"యేటి పిల్లడా? ఏటి.. యింతమంది నీయింటికొచ్చేరు? ఎందుకేటి?" అనడిగింది జన్నోడ్ని.

"ఇల్లు చూపులు...." నవ్వుతూ జవాబిచ్చేడు జన్నోడు.

"ఒసేటి, పిల్లడు..? అన్నీటికీ యిగటాలేనా? సెప్పరాదా? సెబితే,నీ సేరీ భూమి..తరిగిపోదులే." నిష్టూర మాడింది గవిరి.

"అదే, ఆ సేరీ భూమి తగువే. నాకు ఉన్నదే, జన్ని పొలం తాతల తరం నించి వున్న భూమి. ఇవుడేమో.. బుచ్చిదొర లేడా? ఆ కమ్మాదొర-తొలీత రైలు టేసన్ దగ్గిర భూములు కొనీసినోడు? ఆడేమో - యీ జన్ని పొలము ఆడిదే నంతండు. టాక్టరు బెట్టి.. దున్నించేసేడు. ఏటీ దురమారగమని అడ్డితే - కాయితాలున్నాయంతాడు. ఇన్నాళ్ల లేని కాయితాలు... యిప్పుడు నీకెక్కడివీ అని. అందరమూ టాక్టరుని

అడ్డగించబోతే - మీ మాలపేట మనుసులూ, ఆ గోవొర్ధన్నాయుడి మనుసులూ.. మా మీద కొచ్చేరు. మీ అల్లుడు దాసు - పట్టా కత్తి సాముదిప్పేడనుకో.." చెప్తున్నాడు జన్నోడు.

గవిరి - దోషిలా తలదించుకుంది.

దాసు - ప్రజావ్యతిరేకి అయినందుకే గాదు, తమ పేటలో కొంత మంది జనం దాసు వెంట - అన్ని దౌర్జన్యాలకీ వత్తాసుగా నడుస్తున్నందుకు వ్యథ చెందుతోంది. తమ కున్న మెట్టూ, మెరకా సాగుజేసుకోవటం తోటలు కాపుగాసుకోవటం - ఊరిరైతువారితో... రైతులుగా బ్రతకటం మాత్రమే యెరిగిన తమ పేట జనం... యిప్పుడు రైతు బతుక్కి దూరమయినారు. తమ కూతురినే దూరం చేసిన దాసు.. మాల పేట మనుషుల్నీ తమకి దూరం చేసాడా ?

కాళ్లు కడిగి కూతుర్ని అప్పజెప్పినపుడే - పేటలో కట్టుబాటునీ, తన పెద్దరికాన్నీ దాసుకి అప్పజెప్పేసానే.. అని బాధపడేవాడు గవిరి భర్త. గోవర్ధన నాయుడు... వ్యాపారం మీదనే మొదట దృష్టి సారించేడు. కొండలూ, అడవులూ దగ్గరగా నున్న మైదాన ప్రాంతం గ్రామస్థుడు కావటంతో - అడవి కలప వ్యాపారం చేసాడు మొదట. ఆ తర్వాత,ప్రొహిబిషన్ కాలం కావటంతో - వంటసారా వ్యాపారంలోకి దిగేడు. రెండు వ్యాపారాల్లోనూ దండిగా లాభాలు వచ్చేవి. గానీ, కండబలమూ, గుండె ధైర్యమూ కలిగిన మనుషులు,.. పనిలోకి కావలసి వచ్చేది.

వ్యవసాయపు పనులకు తిరిగే రైతు కూలీలు - యీ పనులకు వచ్చేవారు కాదు. అప్పుడు, గోవర్ధన నాయుడు - మాలపేట కోసం ప్రయత్నించేడు. అక్కడా ... రైతు పనులు అలవాటు తప్పా, యీ వ్యాపారపన్లు తెలిసిన వాళ్లు లేరు. కూలి యెక్కువిస్తానంటే సారా సుక్కలు ఫ్రీగా పోస్తానంటే - ఇద్దరు ముగ్గురు కుదిరేరు. వాళ్లకి తోడు అయినాడు దాసు ! దాసు వచ్చేక గోవర్ధన నాయుడి వ్యాపార పన్లు ... నిరాటంకంగా సాగిపోయేవి. అక్రమంగా అడవినుంచి కలప తరలించటం; వంట సారాని రహస్యంగా వండించి, సరఫరా చేయటం దాసు దక్షతగా చేసేవాడు. గోవర్ధన నాయుడు, తన వ్యాపారాన్ని పూర్తిగా దాసు పర్యవేక్షణ లో వదిలేసి, రాజకీయాలలోకి దిగేడు. గ్రామ పంచాయితీకి జరిగిన మూడోసారి ఎన్నికల్లో సర్పంచ్‌గా నెగ్గాడు. మాల పేటని - కాలనీ గా మార్చేడు. కోపరేటివ్ సొసైటీ నుంచి - సబ్సిడీ ఋణాలు యిప్పించేడు. సబ్సిడీలకీ, సారా చుక్కలకీ - 'ఇందిరానగర్ కాలనీ' అలవాటు పడింది. ఊరికీ, మాల పేటకి మధ్య వొకప్పటి ఐక్యత కనుమరుగైంది. గతంలోలాగా, రైతుల పనులకి - కాలనీ వాళ్లు వెళ్లటం తగ్గిపోయింది. సంతవ్యాపారాలూ, సారా వంటలూ, సబ్సిడీ ఋణాలూ.. కాలనీ హరిజన్లలో రైతుమనస్తత్వాన్ని యిగిర్చేసాయి. గోవర్ధన నాయుడి ఓటు బ్యాంకుగా ... రూపుదిద్దు కుంది 'ఇందిరానగర్ కాలనీ.'

గోవర్ధన నాయుడ్ని అంటి పెట్టుకొని దాసూ యెదిగేడు. పేటలో చాలా మందిని తన వెంట తిప్పుకునే స్థితికి చేరాడు. బంధువయి గూడా దాసు - సరస్వతి పెళ్లి విషయంలో ఎంత రభస జేసాడు ? జగదీశ్ ప్రాణాలు.. జన్నోడు లేకపోతే ఆనాడే పోయేవి ! సరస్వతి పెళ్లికి ముందే భర్తని కోల్పోయేది!

గవిరి.. మనసంతా బాధతో నిండి పోయింది. నిర్వేదంగా, జిన్నోడ్ని చూస్తోంది.

" దాసూ, మీ పేట మనుషులూ యెలిపోయినాక, యిటుకాసి అన్నలొచ్చేరు. భోగట్టా సెప్పినాం. అన్నల దళం - మాకు దన్నుగ నిలబడింది. భూమ్మీదకి దిగినాం. జెండాలు పాతినాం.. అదిగో, ఆ భోగట్టా తెల్పింది గావాల - ఆపీసర్లు పాగ్రొచ్చినారు..." వివరించేడు జన్నోడు విషయాన్ని.

ఈలోగా, ఆడవాళ్లంతా - గవిరి గంప చుట్టూచేరారు. లాకి - ఎర్రపూసలూ, ఎర్రరిబ్బన్లూ, గాజులూ తీసుకుంది. సిరిబిడి మజ్జి గయిరమ్మ సిందూరం తీసుకుంది. మరొకరెవరో... కుంకుమ- తలా ఒకటీ తీసుకున్నారు. మధ్యాహ్నభోజనాల వేళకి - గంపలో సరుకు ఖాలీ అయిపోయింది. గంప నిండుగా, పెద్ద కందులు చేరాయి. వాటి మీద - యెవరో యిచ్చిన పెద్దొరస అరటి పళ్లు నాలుగు, చిన్న గుమ్మడి కాయా... పెట్టింది. తపేలాతో తెచ్చుకున్న గెంజన్నం తినేసి తపేలా కడిగి, బోర్లించి గంపలో కందుల లోపలికి దూర్చింది. కాసేపు పోయేక గవిరి బయల్దేరింది.

"పెద్దమ్మా, యీపాలి నువ్వొచ్చినపుడు సరస్వతక్కని తీసికి రావా ...?" కోరింది లాకి.

గవిరి, యేమీ అనకుండా గంప యెత్తుకుంది.

"తీసికొస్తావా? లేదా?" రొక్కించింది లాకి.

గవిరి - లాకి వైపు చూస్తోంది.........

" .... వొస్తే, ఆ రోజే వొచ్చిద్దునమ్మా. తల్లిదండ్రుల్నీ, కుల పెద్దల్నీ యెదిరించి నిలబడి - ఆయన నా మెడలో తాళి గట్టేరు. అయినింట అడుగు పెట్టించేరు. నాకిప్పటికీ.. కలలాగే వున్నాది. ఇదంతా, నిజమన్పించటం లేదు. మేము ప్రేమించుకోవటం, పెళ్లిచేసుకోవటం, కాపురంచేయటం...కొడుకునికనటం, ఆయనచనిపోవటం...యిదంతా జరిగిపోయిన దేనా...? ! ఇదికలకాదా ... అన్పిస్తోంది.."

కన్నీరు మున్నీరుగా యేడుస్తూ సరస్వతి..!

గవిరికి ఒక కొడుకూ, యిద్దరు కూతుళ్లూ సంతానం, ఆఖరి దాయే సరస్వతి. భర్త పోయేక కన్నవారు వచ్చి, తమతో రమ్మని పిలిచేరు గవిరిని. గవిరి వెళ్లలేదు. కొడుకుని, తీసుకుపోయేరు. చదువు సాములు నేర్పి పెంచారు. గానీ, తిరిగి యిటువైపు కొడుకుని చూడనివ్వలేదు.

పెద్ద కూతురినేమో - దాసుకిచ్చి పెళ్లి చేసారు. ఆ కూతుర్నీ దాసు తమకు దూరం జేసాడు. ఆఖరికి, ఆమె మనోవ్యధతో చనిపోయింది.

ఇద్దరి తర్వాత, చాన్నాళ్లు సంతానం కలగలేదు. ఆరేడేళ్ల తర్వాత ఆఖరిపిల్ల సరస్వతి పుట్టింది. సరస్వతి తల్లి పోలిక. తెల్లగా, కళాకాంతుల్తో... చురుకైన పిల్ల. చదువు లో అందరికంటే యెక్కువ మార్కులు తెచ్చుకునేది. రెండు మైళ్ల దూరం నడిచి, కోటిపాం హైస్కూల్‌లో ఎస్సెస్సీ దాకా చదువుకుంది సరస్వతి. ఆ తర్వాత, కాలేజీకి వెళ్లలేదు. ఇందిరా నగర్‌కాలనీ అంగన్‌వాడి సెంటర్‌లో వర్కర్‌గా చేరింది.

హైస్కూలులో చదువుకునే రోజుల్లో కలిసి, మెలిసి తిరిగిన జగదీశ్ సరస్వతిని ప్రేమించేడు. నాయుడోరి వంశం... జగదీశ్‌ది.

నాయుడోరు. - కులం తక్కువ పని చేస్తావా - అన్నారు.

జగదీశ్.. యెవర్నీ లెక్క చెయ్యలేదు. సరస్వతిని తీసుకొని కొండవలస చేరాడు. ఊరిలో కొందరు యువకులు తోడు వచ్చేరు. కొండవలస జన్నోడిపౌరోహిత్యం లో, జాకరదేవత సాక్షిగా.... జగదీశూ, సరస్వతి లపెళ్లి జరిగింది. నాయుడోరు రౌడీలనీ, దాసు తన పేటవాళ్లనీ... దాడికి పంపేడు. కొండవలస తిప్పికొట్టింది వార్ని.

ఆ తర్వాత, తల్లి దండ్రులు జగదీశ్‌ని యింట్లోకి రానీయలేదు. యువకుల సాయంతో, చిన్న పూరిపాక కట్టుకొని అందులో కాపురం పెట్టారు. జగదీశ్ తన వాటా భూమి కోసం... అన్నలు ద్వారా పంచాయితీ పెట్టించేడు. తల్లిదండ్రులు బ్రతికున్నపుడు. అన్నదమ్ములు ఆస్తి పంపకాలు చేసుకోవటం భావ్యం కాదు. ప్రస్తుతానికి బ్రతుకు తెరువుకి ఎకరన్నర పల్లపు భూమి సాగు జేసుకోమనండని - పంచాయితీలో తల్లిదండ్రులు ప్రతిపాదించేరు.

ఎకరన్నర పల్లపు భూమి ఆధారంతో - జగదీశ్ బ్రతకసాగేడు. సరస్వతి గతంలో చేసిన అంగన్‌వాడి వర్కర్ నౌకరీపోయింది. ఆశీర్వాదం మేస్టారి కూతురు ఆ నౌకరీలో చేరింది. సరస్వతీ, జగదీశూ... ప్రైవేట్ క్లాసులు చెప్పటం ఆరంభించారు. ఆ రకంగా, యువకులకు ఆదర్శమయినాడు యువజన సంఘం పెట్టాడు.

గోవర్థన్నాయుడి రాజకీయాల ముందు ఓడిపోయిన రామూర్తి నాయుడు రాజకీయాలకు స్వస్తి చెప్పి ... వ్యవసాయం చూసుకోసాగేడు. పంటల ఎగుడు దిగుళ్లకీ, మార్కెట్ మాయాజాలానికీ, యెందరో రైతులు చిదిగిపోయేరు. చిదిగిపోయిన రైతులు ... రామ్మూర్తి నాయుడిలాగానే, రాజకీయాల్ని పట్టించుకోలేదు. వారి పిల్లలు యిప్పుడు. . జగదీశ్ వయసువాళ్లు యువజన సంఘం లోచేరారు

దురదృష్టం.... సరస్వతిని వెన్నాడింది !అడవికి ఎడ్ల బండిని తోలుకువెళ్లి, అటునుంచి కర్రలతో నిండుగా బండి తోలు కొస్తున్న జగదీశ్‌ని రైల్ రోడ్డు దాటుతుంటే మలుపులోంచి, మౌనమృత్యు రాక్షసిలా వచ్చిన గూడ్స్‌రైలు ఢీకొంది. సరస్వతికి - సర్వ ప్రపంచమూ శూన్యమైంది...

తనతో కోలనీకి వచ్చేయమని గవిరి బ్రతిమాలితే - సరస్వతి... యేడ్చిన యేడ్పు యిప్పటికీ మర్చిపోలేదు గవిరి !...

"...యేటి పెద్దమ్మా ? ఏటీ సెప్పకుండా, అలాగ మవునం దాలిసినావేటి? " గవిరిని కదిపి అడిగింది లాకి.

గవిరి ఆలోచనల్లోంచి తేరుకొని -

"నీపెళ్లికి వొస్తాదిలేమ్మా...." అంది .

"అయితే మరి. యీ జనమల రానట్టే సరస్వతి....." అంది లాకి తల్లి.

"అదేటి అమ్మీ... అలాగంటావు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది గవిరి.

"... మరేటి ? నీకు తెల్దుగావాల..? అన్నల్లోన కలిసిపోతాదట..!" కూతురుకి దూరంగా జరిగి, చెప్పింది తల్లి.

"... శీను అన్న మీద మనుసుపడింది. ఆ యిసయం అన్నలకి సెప్పదిది. అన్నలకు అక్కర్లేదిలాటి యిసయాలు.." మరి కొంత, ఆరా చెప్పింది. పొరుగింటామె.

గవిరి, ఆశ్చర్యంగా లాకివైపు చూసింది.

" ... ఈ సారి , సరస్వతప్పని తీసికొని వొస్తేనే... నిన్ను వొలస రానిస్తాను. లేపోతే, వొలసల అడుగెట్టనియ్యను. ఆఁ " అని, హెచ్చరిస్తూ అక్కడినుంచి పారిపోయింది లాకి.

గవిరి, నవ్వుకుంటూ, గంపయెత్తుకు బయల్దేరింది.

కొండవలస దాటి నడుస్తుంటే గవిరికి మళ్లీ. పొద్దుట దాసు చేసిన హెచ్చరిక గుర్తొచ్చింది. కూతురి పిల్లలు గుర్తొచ్చేరు. తల్లిలేని ఆ పిల్లల కోసమయినా - సరస్వతికి నచ్చచెప్తేనో..?

"దాసు, మా వొలస మీదకి మనుషుల్తో టొచ్చి, పట్టా కత్తిపట్టుకొని, సాముదిప్పేడు." జన్నోడి మొహం గుర్తొచ్చింది.

" పెద్దకూతుర్ని యిచ్చి... పొరపాటు చేసామేమో.." మనసులో, చాలాసార్లు.. దొర్లిన మాటలు గుర్తొచ్చేయి. దాంతో సరస్వతికి నచ్చ చెప్పాలన్న ఆలోచనే... తుడిచేసుకోవాలని నిర్ణయించుకుంది. మరో ఆలోచన లేకుండా మౌనంగా యింటి దారివైపు వడి. వడిగా నడిచింది.

★ ★ ★

" గొడ్డుని చంపే కత్తితోటి... గోంగూర కొయ్యలేక పోయేడట, నీలాటోడే! ఈసారి, మనం గుండు గొరిగించుకోవటం ఖాయం...."

మధునాయుడు.. యెంత మాట బడితే అంతా అనేస్తున్నాడు. దాసు, అసహనంగా కూర్చున్న అరుగు మీంచి లేచి, అటూ యిటూ తిరుగుతున్నాడు. మధునాయుడు మాటలు శూలాల్లా తగుల్తున్నాయి దాసుకి. మరొకరెవరో - అలా మాట్లాడితే, వేటకత్తితో వేట వేసేవాడు. గానీ, తననీ.. తన వేట కత్తినీ కాపాడినవాడు మధు! మర్చిపోలేడు మర్చిపోటానికి .. యేళ్లు గాదు గడిచినవి కొద్ది మాసాలే..

గోవర్ధన నాయుడు.. రాజకీయాల్లోకి దిగేక వ్యాపారాలు వొదిలసాడు. దాసుకి అవి అందుకోడానికి ఆర్థిక పూటు చాల్లేదు. నాయుడిగారి దాయాదులు ఆ వ్యాపారాలు అందుకున్నారు. వాళ్ల దగ్గర... దాసుకి నప్పలేదు. పనిమానేసాడు. పదీపాతికా చేతిలో ఆడటం, పదిమందిని వెనకేసుకు తిప్పడం అలవాటైన దాసుకి పనేమీ లేక, గోళ్లు గిల్లుకు కూర్చోవటమా, పిల్లి బుర్రకి క్రాఫ్‌చేయటమా .. అన్నట్లుగా వుండేది.

ఇలాంటి సందర్భంలోనే, ఒకరోజు గోవర్ధన నాయుడు గార్నిండి కబురొచ్చింది. రెక్కలు కట్టుకు... వెళ్లాడు దాసు.

".. ఏంజరిగిందో గానీ - అవూ, దూడా రెండూ చచ్చిపోయేయిరా ! సాలలవున్నాయి. ఆట్ని అక్కడ్నించి పట్టుకు పోవాలిరా.." చెప్పారు నాయుడుగారు.

అలా ఆ రోజు, ఆ చనిపోయిన "గోమాత, దూడా" దాసుకి కొత్త జీవన మార్గం చూపేయి. పశువుల చర్మాలు కొనటం, ఎగుమతి చేయటం ఆరంభించేడు. అక్కడక్కడా సంతల్లో... పశువుల్ని చంపి, మాంసం గూడా అమ్మేవాడు... మళ్లీ, చేతినిండా డబ్బులు ఆడటం మొదలైంది. వెనక పదిమందీ.. చేరటం ఆరంభించేరు. వాటితో పాటే - " చర్మాల దాసు" అన్న పేరూ చేరింది. ఆ పేరే నచ్చేది కాదు. తెగ విసుక్కునేవాడు.

" వ్యాపారం మానెయ్యిరా అయితే ! గోవుల్ని చంపి, చర్మాలు అమ్మితే మరి ఆ పేరే వొస్తాది.అది మానేసి, గోవుల్ని కాపలాకి కుదిరి పో... గోపాలక్రిష్ణుడి పేరొస్తాది. అయితే, యిప్పుడ్లాగ రూపాయిలు కూడెయ్యిలేవు. పేడ కచ్చిలు కూడేస్తావు. అది గ్రహించు.." అనేవారు గోవర్ధన నాయుడుగారు.

రూపాయిల ద్వారా లభించే. సౌఖ్యాల్ని అనుభవించిన దాసు, ఆ వ్యాపారాన్ని విడిచి పెట్టలేదు . మరికొంతవిస్తరించేడు . పొరుగు రాష్ట్రాల వ్యాపారుల్తో లావాదేవీలు పెట్టుకున్నాడు. అప్పుడు స్థానికంగా తన వ్యవహారాలు చూడ్డానికి, గ్రామాల్లో చర్మాలు కొనడానికీ, అవి గోడౌన్లలో భద్రపరచడానికీ... జానేసుని

గుమస్తాగా పెట్టు కున్నాడు. జానేస్ - పదవతరగతి పరీక్షల మెట్లు మూడుసార్లు తన్నేసి పడిపోయి, ఆ మెట్లకి దండం పెట్టేసి - దాసు దగ్గర గుమస్తాగా చేరాడు. గ్రామాలు వెళ్లి .. చర్మాలు కొనటం... జానేసు చూసేవాడు. ఇక... దాసు తనని 'చర్మాల దాసు' అని ప్రజలు రిఫర్ చేయరనుకున్నాడు. గానీ జానేసు - " చర్మాల గుమస్తా" అయ్యేడు గానీ దాసు.. 'చర్మాల దాసు' గానే నిలబడి పోయేడు. ఆతర్వాత కొన్నేళ్లకి, పంచాయితీ రిజర్వుగావటం గోవర్ధన నాయుడు దాసుని సర్పంచ్ చేయటం.. రోజ్‌గార్ ఫండ్స్ పూర్తి స్థాయిలో ఖర్చు బెట్టి... గ్రామంలో కొన్ని నిర్మాణ పనులు చేసినా - "చర్మాల ప్రెసిడెంటు", అనే ప్రజలు గుర్తు పెట్టుకున్నారు. ఇప్పుడు దాసు - తనను యెలా పిలుస్తారన్నది.... పట్టించుకోవటం మానే సాడు. పంచాయితీ సర్పంచ్‌గా వున్నపుడే తనూ ఒక బిల్డింగ్ గట్టేడు. పంచాయితీ బిల్డింగ్ తో పాటూ ఆ బిల్డింగుని... గ్రామీణ బ్యాంకు వారికి అద్దెకిచ్చేడు. ఆ బ్యాంకు ద్వారానే సబ్సిడీ ఋణం పొంది, ఒక టయోటా వ్యాను కొన్నాడు. దాని మీద "చర్మాలు, గోవు మాంసమూ" యితర రాష్ట్రాలకు రవాణా చేస్తుంటాడు.

సర్పంచ్‌గా, బిల్డింగ్ ఓనర్‌గా, సంపాదన పరుడిగా యెదిగిన దాసుని దీవించి యీ లోకంలోంచి నిష్క్రమించేరు గోవర్ధన నాయుడు గారు. వీధి దీపంఆరిపోయి నట్లన్పించింది దాసుకి. ఆ తర్వాత, పంచాయితీ జనరల్ అయిపోవటం, నాయుడుగారి అబ్బాయి మధునాయుడు సర్పంచ్ కావటం దాసు భార్య చనిపోవటం, గోవధ చేస్తున్నాడని యువజనులు అల్లరి చేయటం ఆ సమయాల్లో - మధు నాయుడు ఆదుకోవటం... దాసు మర్చిపోలేడు.

".... ఆశీర్వాదం మేస్ట్రుకూతురు నిలబడుతాదట. తెల్సా?" అడిగేడు మధునాయుడు.

దాసు - పెదవి విప్ప లేదు.

"... అయితేమి ? దాసు కూతుర్ని గాని నిలబెట్టమంతావా, యేటీ ? మైనారిటీ దీరని పిల్ల గావాల ? " అన్నాడు అక్కడే పనీపాటూ లేక కూర్చున్న నక్కేన కన్నయ్య.

".... దాసు కూతురే అందుకొస్తే... యీ బాధలల్లా యేల ? ఎక్కడలేని ప్రేమా పుట్టుకొచ్చింది గవర్మెంటుకి ఆడోళ్లమీద. మన పంచాయితీ రిజరు సెయ్యిడిమే గాక, హరిజన ఆడోళ్లకే కేటాయించీసేరు..' ' ఉక్రోషం వెళ్లగక్కేడు గొల్లవీధి వార్డు మెంబరు సోమయ్య.

"... పోనయితేమి ? ఎల్లకాలమూ.. ఒక్కలే యేలీయాలేటి జగాన్ని. ఈపాలి ఆళ్ళవోటా...! కానీయనీ. " పొగాకు రెమ్మ సాపుజేస్తూ తన అంగీకారాన్ని తెలిపాడు కన్నయ్య.

"...... నిన్నెవుడడిగేడ్రా ? ముందెల్లు నువ్వవతలకి..." గసిరేడు మధు.

".... ఒసే....! నీనేటి ఉస్కో.... అన్నానా ? నువ్వు కలబడిపోడానికి ..? " పొగాకు రెమ్మసాపుజేస్తూ తాపీగా జవాబిచ్చేడు కన్నయ్య.

".... అదరా ! అదే వొద్దంతాను. నీకేటి పనిక్కడ ? ఇంటి మీదది - వొంటి మీదకి తెచ్చుకునీ మాట్లాడతావు..." గొల్లవార్డు మెంబరు, కన్నయ్యని కోప్పడ్డాడు.

"నీనేటన్నాను ? ఇచ్చకం కబుర్లాడడానికి - నీలాగ దినం తీరదనుకుంతన్నావా, యేటి ? సబుబు అన్పించింది - సబుబన్నాను, మీకు సాలికొస్తే నీనేటి జేసేది ?" పొగాకు రెమ్మ, బనీను జేబులోపెట్టు కుంటా....నిల్చున్నాడు కన్నయ్య.

అప్పుడు చల్లబడ్డాడు మధునాయుడు. మనసులో అనేక పథకాలు వేస్తున్నాడు. సర్పంచ్ పదవి తన చేతిలో మనిషికే రావాలి. దాసు, యేదో నిర్ణయానికొచ్చినట్లుగా లేచాడు. మదువైపు చూస్తూ -

" పొద్దుట మాయత్తకి చెప్పాల్సిందంతా చెప్పాను. సరస్వతికి సెప్తాను. రేప్పొద్దుటికి - అటో, యిటో తేల్చెస్తాను.." అన్నాడు.

" నామినేషన్‌కి - ఎల్లుండే ఆఖరు రోజు..." గుర్తు జేసాడు మధునాయుడు.

"సరస్వతి వొప్పుకుంతాదంతావా...?" అనుమానాన్ని మళ్లీ వ్యక్తం జేసాడు, సోమయ్య.

".. ఇంతకీ నువ్వు - సరస్వతి మెడల తాళి గడతావా ? సరస్వతి సేత నామినేషనే యిస్తావా ? ఇంతకీ యేది ముందు ? ఏది యెనక ? '' నిలబడిన కన్నయ్య .. దాసుని ప్రశ్నించేడు.

మళ్లీ అనవసర ప్రసంగానికి దిగుతున్నాడని, యెక్కడలేని కోపమూ వచ్చింది మధుకి.

"... నీకు యింత వయసొచ్చింది గాని...నోరు తగ్గింది గాదు. చుట్ట పోడివి గదా అని గడపెక్కనిస్తన్నాను. పో ముందు. ముసిలినాకొడకా..! ముసలికాలం వొచ్చింది. నలుగురి దగ్గిరా మంచి అన్పించు కోరా" ముసలోడ్ని దులిపేసాడు.

ఇదే అదనని, గొల్ల వార్డు మెంబరు, మరో బెడ్డ వేసాడు -

"... బుర్రని పుట్టిన బుద్ది పులిమితే పోతాదా ? పుడకల్తోటి కాల్సిన్నాడు పోవాల గాని ..." సామెత చెప్పాడు.

అప్పుడు, కన్నయ్య, గొంతు పెంచి -"... ఎవులికయినా, యేటి పోవాలన్నా, కాస్టంల పుడకలు తోటే పోతాయి. నాకే గాదు,యెవులికైనా! యిదొక్కముక్కమంచి ముక్క సెప్పావురా మెంబరో,యిన్నాళ్లకి.." అని తిరిగి, దెబ్బ గొట్టేసి, అక్కడ్నించి వెళిపోయేడు కన్నయ్య.

"సరస్వతిని - జగదీశ్ వున్నపుడిచ్చిన భూమి మీదకి, రానీయకుండా చెయ్యాలి.." ఆలోచిస్తూ మధు.

"... జగదీశ్ తల్లిదండ్రులు జడుస్తండ్రు. యువజన సంగపోళ్లో, మాల పేటోళ్లో... సరస్వతి యెనకున్నారని.." సోమయ్య అప్పటికే... భూమి విషయాన్ని సరస్వతి అత్తవారితో కదిపేడు.

"... మాలపేట నిండి పిట్ట మనిషి రాకండా... సూసుకునీ పూచీ నాది." హామీ యివ్వ బోయాడు దాసు.

"..... నువ్వు నీను చెప్పింది చూద్దూచాల్లు. ఎలక్షన్ ముందు యేది చూసుకున్నా.. కథ మారిపోగల్దు! ముందు, నువ్వు మీ యత్తని.. మంచి జేసుకుందూ.. తర్వాత కథ నీన్నడిపిస్తాను...." విసుగ్గా చెప్పాడు మధు.

దాసు - మరేమీ మాట్లాడకుండా, మౌనంగా వెళిపోయేడు ఆ తర్వాత, మధు నాయుడూ, సోమయ్యా కొంతసేపు మంతనాలు జరిపేరు . మదు నాయుడు - తండ్రిని మించిన రాజకీయ వేత్త అయిపోయేడు. ఎప్పుడూ, అధికారంలో వున్న పార్టీలోనే... సభ్యుడిగా వుంటాడు. కాంగ్రెస్ అధికారం లో వున్నపుడు - కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంటయ్యాడు. తెలుగు దేశం అధికారంలో వున్నపుడు మండలాధ్యక్షు డయ్యేడు. వార్డునుండి, మండలం దాకా మధునాయుడి చేయిదాటి, యేవ్యవహారమూ జరక్కూడదు. దీర్ఘంగా ఆలోచించి-

"..... సోమయ్యా...! మా ముసిలోడ్ని.. రమ్మనిమీ..." అని చెప్పాడు.

"... ముసిలోడా ? ఎవులు ? జగదీశు తండ్రినే..?" ప్రశ్నించేడు సోమయ్య.

".. ఆడ్నే రమ్మను .... సెప్తాను..." మనసులో పథకం రూపుదిద్దుకోగా చెప్పాడు మధు.

సోమయ్య వెళ్ళాడు.

★ ★ ★

బాబుని గడపలో దించి, వాకిలి తుడుస్తోంది సరస్వతి. ఊరిలోకి యేదో పనిమీద వచ్చిన రెయ్యమ్మ సరస్వతిని చూసి వచ్చింది.

"ఔనమ్మీ ! సరస్వతీ, నిజిమేనేటి?" అని ప్రశ్నించింది.

సరస్వతికి - యేవిటో అర్థం కాలేదు. మళ్లీ, రెయ్యమ్మే -

" ఆ నామినేసన్ పాపారావు లేడూ ? ఆడు సెప్పాడు.." అంది.

" యేటి చెప్పాడు ? ఏటసలు విషయం సరిగ్గా చెప్పరాదా ?" విసుక్కుంది సరస్వతి.వాకిలి తుడిచేసి, గడపలోకి వొచ్చింది. రెయ్యమ్మ గూడా ఆమెతో పాటేవచ్చి -

"..... యిదిగో, యీ పొద్దు యిస్తాం. ఆ పొద్దు యిస్తాం... రేపురాండి, మాపురాండి. అని తిప్పినారా బేంకీవోళ్లు , ఆకరికి, యిపుడేమో - మనకెవులికీ లోన్సు యివ్వరట..." చెప్పింది.

" అటా యేటి, యివ్వరు. నేను ముందే చెప్పాను. మన కేస్ట్అందరమూ, సెపరేట్‌గా దరకాస్తు లెడదాం అన్నాను. విన్నారా? ఎద్దు ఎండకీ, ఎనుబోతు నీడకీ లాగినట్లు.... మనోళ్లని ఆ గుడివాడ పాపారావేమో.... ఎమ్మెల్యే వెంట దిరగాలన్నాడు. సరస్వతమ్మేమో ... సంగంల కేస్ట్ ఊసు యెందుకూ పేదలందరూ ఒకటే అని, సంఘం వెంటనడిపించింది. నేనేమో.. దళిత సంగం తరఫు. మూడు లిస్టులు వెళ్లాయి బ్యాంకుకి. ఒకలిస్టుకిచ్చి, మరో లిస్టు కివ్వక పోతే గొడవలొస్తాయని.. యేకంగా, యీ ఊరికే యీ యేడాది... యే స్కీములూ లేవనీసేరు" అప్పుడే, అటువైపు వచ్చిన ఆశీర్వాదం మేస్టారు చెప్పారు.

ఈ మాటల్నీ, వీళ్లనీ - యెదురు వాసలోంచి గమనిస్తోన్న సరస్వతి అత్తగారు, వీధి వాకిలి చివరికి వచ్చి - కాండ్రించి ఉమ్మివేసి -

"...ముండమంద. యెక్కడి పెంటల మీది కోళ్లన్నీ.. యెలిపోవొచ్చి - గడపలు తొక్కేస్తన్నాయి..' అంటూ గాలిలో చేతులాడించి, వీధిలో తిరుగుతున్న కోడిపిల్లల్ని అదిలించింది.

ఆ కాండ్రించి ఉమ్మటం, కోళ్లను అదిలించటం, ఆమె ఆడిన మాటలూ.. తమని ఉద్దేశించే అని గ్రహించింది రెయ్యమ్మ. కోపంగా, ఆమె వైపు చూసి ఆ తర్వాత, ఆకాశం మీదకి చూస్తూ-

"... యిదేటమ్మీ... యీ కాకి యిలాగరుస్తంది ? యేళా, పాల లేదేటి దీనికి ? కారం దాకల గానీ మూతి బెట్టిందా యేటి... ముండ్రాల కాకి..?" అంటూ, యెక్కడో యెగిరే కాకి నుద్దేశిస్తూమాట్లాడింది.

ముసలమ్మకు ఆ మాటలు వినబడ్డాయి. వాటి అంతరార్థమూ బోధపడింది. దాంతో -

" ... యేమే? కాకి మీదా, పిల్లిమీదా పెట్టి యెవుల్నేతిడతన్నావు ? కాదూ, యెవుల్నే..? " కయ్యానికి కాలుదువ్వుతూ, వీధిలోకి వొచ్చేసింది. ఆమె వెనక, ఆ యింటి ఆడపడుచులూ, కోడళ్ళూ.. దిగిపోయేరు.

సరస్వతి ఆందోళన చెందింది. అనవసర గొడవొచ్చినట్లుందని రెయ్యమ్మనే తగ్గమని బ్రతిమాలింది.

రెయ్యమ్మ - నిర్లక్ష్యంగా ముసలమ్మనూ, వెనుక వచ్చేవారినీ చూస్తూ -

"....నువ్వు కోడిమీదా, కుక్కమీదా పెట్టి తిట్టొచ్చా ? నీదే నోరు.. మాది కాదా ? మాకేటి పోషిస్తున్నవేటి? నాయురాలి వయితే - నీ యింటిల సెల్లించుకో, ఈధిల కాదు"అని దులిపేసి, వెళిపోయింది.

"... ఆళందర్తోటి లాగుతావేటి ముసిలీ . అసలు దాన్ని వొదిలీసి.." ఆడపడుచు సరస్వతిని చూస్తూ ముసలమ్మను మందలించింది.

ముసలమ్మ - సరస్వతి వైపు చూస్తూ, చేతివేళ్ల మొటిమలు విరుస్తూ, ఆకాశంలోకి చూసి మొక్కుతూ, శాపనార్థాలు పెట్టుకుంటూ యింట్లోకి వెళిపోయింది.

అప్పుడే వచ్చాడు, మధునాయుడు పంపినవార్డు మెంబరు, సోమయ్య. సరస్వతి అత్తగారి వెంట యింట్లోకి వెళ్లాడు.

★ ★ ★

గడపలో బాబు - గుక్కపట్టి యేడ్వసాగాడు. సరస్వతి బాబుని యెత్తుకుంది.

ఆశీర్వాదం మేస్టారు అంతా చూస్తూ... నిల్చున్నారు. ఎవరినీ యేమీ అననూ లేదు. అక్కడినుంచి వెళ్ళిపోనూ లేదు. మాస్టారు యేదో మాట్లాడాలని వచ్చి వుంటారని. భావించి సరస్వతి కదిపింది -

" మేస్టారూ, పనేమేనా వుందా ? మన కాలనీకే వెల్దామనుకుంటన్నాను. మూడు రోజులైంది. అమ్మ దగ్గరకు వెళ్ళి.."

ఆశీర్వాదం మేస్టారు ఆలోచనలో పడిపోయేరు. ఇక్కడికంటే కాలనీలోనే.. స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చని -

"... పదమ్మా నీనూవస్తాను.." అన్నారు.

ఇద్దరూ... కాలనీకి నడిచేరు.

సరిగ్గా, అప్పుడే కొండవలస నుంచి తిరిగొచ్చింది గవిరి. అమ్మమ్మని చూసి, బాబు చేతులు చాపి మీదకు వెళ్లబోతుంటే -

" ఉండుండు నాయినా ! కొండా, పెండిలు తిరిగొచ్చేను. గాలీ, ధూలీ దోషం తగలగల్దు.. కాళ్లుకడుక్కొస్తాను..." అని చెప్పి గవిరి, తలమీది గంపను యింట్లో మూలదింపి పెరట్లోకి వెళ్లింది.

".. మూడు లిస్టులిచ్చినా, అన్ని లిస్టుల్లో పేర్లూ మనవేగదా ? అందరికీ యిచ్చీవొచ్చు గదా? " సరస్వతి, బ్యాంకు లోన్‌ల గురించి అడిగింది, ఆశీర్వాదం మేస్టార్ని.

"ఊరందరి ఊసు మనకేలమ్మా ? దళితులకయితే స్కీములున్నాయి. బ్యాంకు వాళ్లిస్తారు. ఇవ్వకపోతే గవర్నమెంటుకి రాస్తాం. దర్నా, గిర్నా చేస్తాం.."

మాస్టారి జవాబు విన్నాక, సరస్వతి - మరియీ విషయం యితనితో మాట్లాడటం నిరుపయోగం అనుకొంది. గడపలో నున్న మంచం వాల్చి, మాస్టార్ని కూర్చోమంది. ఈలోగా, గవిరి కాళ్లూ, చేతులు కడుక్కొచ్చి సరస్వతి నుంచి మనవడ్ని అందుకొని.. ముద్దులాడసాగింది. మాస్టారు కూర్చుంటూ--

"సరస్వతమ్మా .... నువ్వు గాని నామినేషన్ వేస్తావా ?" లోగొంతులో అడిగేరు.

సరస్వతికి బోదపడలేదు. గవిరిగూడా... యిటే చూస్తోంది.

"అదేనమ్మా ... మనపంచాయితీ సర్పంచ్ పదవి, యీసారి మన షెడ్యూల్డ్ కేస్ట్ లేడీస్ కోటా కింద కొచ్చింది గదా ..? " వివరణ యిచ్చేరు మాస్టారు.

" అయితే..?" సరస్వతి ప్రశ్నించింది.

".. మరేం లేదు. దాసు, యెవరితోనో అన్నాడట.." మాస్టారు ఆగిపోయేరు.

గవిరికి - పొద్దుట దాసు ముదలకింపుగుర్తొచ్చింది ! మేస్టారు.... యింకేం విన్నాడో..?

"...యేటన్నాడు మేస్టుగోరూ ?" అడిగింది గవిరి.

"సరస్వతమ్మ చేత నామినేషన్ వెయ్యిస్తానని అన్నాడట.."

గవిరి, సరస్వతి మొహంలోకి చూసింది.

"ఆ మాట నిజమైతే - నీ నాగిపోతాను. అమ్మాయిని ఆపేస్తాను. సరస్వతమ్మ వొకటీ, నా కూతురొకటీ కాదు గదా..." మాస్టారు చాలా లౌక్యంగా మాట్లాడ సాగేరు.

సరస్వతికి.. యీ విషయాలేవీ తెలీవు. దాసు ప్రయత్నాలూ తెలీవు. అయినా, దాసు యీ విషయంలో జోక్యం చేసుకుంటున్నాడని మాస్టారు చెప్పటంతో.. యేదో కుట్ర జరుగుతోందని అనుమానించింది.

"..అవునుగానీ, మాస్టారూ, యీ రిజర్వుడుసీటు వలన మనకు జరిగేమేలు యేఁవిటీ?" చర్చలోకిదిగింది సరస్వతి.

ఆశీర్వాదం మేస్టారు జవాబు కోసం - వాసాలు లెక్కబెట్టారు.

" మన కులం అంటరానితనం పోతుందా? మనకు భూమిమీద హక్కులొస్తాయా? మన బ్రతుకులుమారతాయా..? " యెన్నో ప్రశ్నలు సరస్వతి వేసింది.

"రాజ్యాంగబద్ధత కోసం ..పంచాయితీనుండి, పార్లమెంటు దాకా దోపిడీ వర్గాలు.. ఎన్నికల తంతు నిర్వహిస్తారు. గానీ , యే ఎన్నికల్లోనా ప్రజలు గెలవరు.." - జగదీశ్ మాటలు గుర్తొచ్చాయి సరస్వతికి.

"అధికారం చేతికొస్తే.. అప్పుడైనా కొంత మార్పు తేగలమేమో గదమ్మా..?" జవాబు వెదికి చెప్పారు మాస్టారు. మాస్టారి గొంతులో నిజాయితీ ధ్వనించింది.

"..నిజంగా, మనచేతికి అధికార మిచ్చేస్తారా?" సరస్వతి ప్రశ్నించింది. ఆశీర్వాదంమేస్టారు-

" ప్రయత్నిద్దాం!ఆలోచించి చెప్పు. ఎల్లుండే ఆఖరు రోజు. నువ్వుపోటీ చెయ్యకపోతేనే–అమ్మాయి చేత నామినేషన్వేయిస్తాను. మనపేటలో మరెవరూ పోటీచెయ్యరు."

"..మరి, మాదిగవాడ నుండి యెవ్వరూ చెయ్యరా ?" ప్రశ్నించింది సరస్వతి.

"వాళ్లనీ కలిసేను. మనమంతా దళితులం, మనమధ్య చీలికలు తెచ్చి - అగ్రవర్ణాల వారు లబ్ధిపొందుతున్నారని చెప్పాను. మాదిగవాడల, యెవరికీ ఆ ఉద్దేశం లేనట్టే.." ధృవీకరించేరు మాస్టారు.

"..ఆళకి లేప్పోయినా, నాయుడోరు కలిపించరా..?" గవిరి అనుమానాన్ని వ్యక్తం చేసింది.

ఎందుకిలా ప్రశ్నిస్తున్నారో.. యేమన్నాపోటీచేసే ఉద్దేశం వుండి.. యివన్నీ ఆరాలు తీస్తున్నారా తల్లీ, కూతుళ్లూ... అని మాస్టారు అనుమానించేరు. అన్నీ, ఆలోచించే -

"..ఉన్నాయమ్మా.. రాచకీయ యెత్తుగడలు. చెప్పలేం ..! దించినా, దించొచ్చు! అయితొకటీ, మాదిగవాడల యెవురు దిగినా గెలవరు. మనపేట చీలకుండా వుంటేచాల్ను. రైల్వేస్టేషనూ, ఊరిలో సగమూ

- యెలాగా మనకే పడతాయి.. సంగముంది గదా? అందుకే.. దిగితే సరస్వతే లేప్పోతే మా అమ్మాయి అయితే గెలుపు మనదే. తిరుగు లేదు..." చెప్పారు మాస్టారు.

".. నాకా ఉద్దేశం లేదులెండి.." తననిర్ణయాన్ని వెల్లడించింది సరస్వతి. ఆశీర్వాదం మేస్టారు ఆనందంగా చూసేరు.

గవిరి, సరస్వతి వైపు చూస్తూ.. ఆలోచిస్తోంది. ఒక విషయం తేలిపోయింది. మరి, రెండో విషయమో... దానికి... సరస్వతి నిర్ణయమేవిటి? అసలు, యింతకీ,, దాసు - దీనితోనే లంకె పెట్టాడేమో ? ఈ విషయం ఒప్పుకోకపోతే మరి రెండోవిషయాల ఊసే వుండదేమో ? గవిరి యెంత ఆలోచించినా, యేదీ స్పష్టం కావటం లేదు.

".. అయితొస్తానమ్మా మళ్లీ కలుస్తాను.." మాస్టారు వెళిపోయేరు.

సరస్వతి గూడా, బాబు కోసం చేతులు చాచి -

" మరి, నీనూ వెళ్తానమ్మా. పోద్దుబోయింది. వంట చెయ్యాల..." అంది.

"... ఈ రాత్రికి వుండిపోయే. ఇపుడెల్లి, పిల్లడితోటి వంటేటి చేస్తవు." సరస్వతితో, బోలెడు విషయాలు మాట్లాడాలని వుంది గవిరికి.

సరస్వతికి గూడా - మనసు బరువుగా వుంది. అద్దె యింట్లో యిబ్బందులు, అత్తవారి అదిలింపులు, భూమి గొడవలు, బాబు భవిష్యత్తు... తల్లి పక్కలోదూరి, మనసులోని బాధలన్నీ తల్లితో కలబోసుకోవాలని వుంది సరస్వతికి.

"..బియ్యం కడిగి, యెసర పెడతాను. కసింత, ఆచింతపిక్క తీసి, పులుసు పెట్టు.." పని పురమాయించింది గవిరి.

సరస్వతి, బాబుని కుదురుగా కూచోబెట్టి చింతపండు గంప అందుకుంది.

".. కొండొలస జన్నోడి కూతురు లాకి - యిపాలి నిన్ను తీసుకొని రమ్మన్నాది.." యేదో మాట్లాడాలని, అందుకు ఉపోద్ఘాతంగా.. లాకి కబురు చెప్పింది గవిరి.

సరస్వతికి - లాకి వైపు ఆలోచనలు మళ్లేయి. తొలి సారిగా, సరస్వతీ, జగదీషూ.. జంటగా అడుగు పెట్టింది కొండవలస జన్నోడి యింటనే ! లాకి. ఆడపడుచులా... జగదీశు సిగ్గుపడుతుంటే.. తలుపు కడ్డం నిలబడి.. ఆడపడుచు కట్నం అడగటం..! జగదీశ్ బంధువులు దాడికి వస్తే.. అన్నల దాకా విషయాన్ని తీసుకెళ్లిన లాకి..!

".. లాకి దళంల సేరిపోద్దాట..! పెళ్లిజేసు కోమంటే యినకుంటందాట.." గవిరి, లాకి తల్లి చెప్పిన విషయాలు చెప్పింది.

సరస్వతి ఒక క్షణం మౌనంగా వుంది -

".. ఔనమ్మా.. యీ మధ్య నీకు... శీను అన్న కలిసేడా?" అనడిగింది. సరస్వతి యెందుకడిగింది శీను గురించి.. అని ఆలోచిస్తూ - 'లేదు' అని చెప్పింది గవిరి.

చింత పండు కొద్దిగా తీసి, తల్లికే అందించి -

"..నీకొక్కదానికే .. యెసరు బెట్టుకోమ్మా. నేనెలిపోతాను. ఇంటిలో దీపం వెలిగించొద్దా..?" అని చెప్పి బాబుని అందుకుంది సరస్వతి. లాకి భోగట్టా విన్నాక.. సరస్వతికి.. శీను అన్నమాటలు..."గత పోరాటాలకు నేటికీ యెంతో తేడా. ఇపుడు స్త్రీలు, దళితులూ రంగం మీదకి వచ్చేరు. ఈ రెండు రంగాల్లో ఉద్యమాలు అభివృద్ధి కావాలి. సరస్వతక్కా నువ్వు ఉద్యమం కోసం ....." గుర్తొచ్చాయి. ఎందుకో.. ఒంటరిగా.. తన యింటిలో.. బాబుని కౌగలించుకు యేడవాలన్పించింది సరస్వతికి.

"..ఓసిదేటి? ఉంతావనుకున్ను.." ఆశ్చర్యపోతూ గవిరి, బ్రతిమాలింది.

"లేదమ్మా.. ఇల్లు చీకటి చెయ్యగూడదు, వొస్తాను.." అని బయల్దేరింది. సరస్వతి.

కూతురు వెళిపోవటంతో - గవిరికి యెక్కడలేని నిస్సత్తువా కలిగింది. వంట చెయ్యబుద్ధిపుట్టలేదు. బియ్యం.. యెసరలో పొయ్యకుండా తిరిగి డబ్బాలో పోసేసి, పొయ్యి ఆర్పేసింది. అలా, దిగాలుగా, యింట్లోకి వొచ్చి, చాపయినా పరుచుకోకుండా.. నేల మీద వాలిపోయింది. నిద్రలో యెన్నెన్నోకలలు. కన్నవారింటిలో తన బాల్యం. సరస్వతి, జగదీశ్ లపెళ్లి, జన్నోడికూతురు లాకి దళంలో కలిసి పోయినట్లూ, ఆశీర్వాదం మేస్టారి కూతురు.. సరస్వతి కాళ్లకు మొక్కుతున్నట్లు.. ఎవరో ఒక చంటిపిల్లాడు... చప్పట్లు కొడుతూ, తడబడు నడకల్తో.. యెటో.. యెటో.. వెళిపోతున్నట్లు.. వాడికోసం.. పెనుకేక వేసింది గవిరి.

అంతే! మెలకువ వచ్చేసింది. త్రుళ్లిపడి గుండెల మీద.. తుంపర్లు ఉమ్ముకుంది. బాగా రాత్రి అయినట్లుంది. వీధిలో మనుషుల అలికిడి తగ్గింది. గవిరి, లేచి కూర్చొంది.

యెవరిదో యేడుపు విన్పించింది. గభాల్న.. కలలో విన్నట్లుగా.. లేచి వీధిలోకి వెళ్లింది.

ఇంటిముందు.. దాసు కూతుళ్లు యిద్దరూ నిల్చొని యేడుస్తున్నారు. గవిరికి గుండెలు కలచివేసాయి. గభాల్న మనవరాళ్లను కౌగలించుకుంది.

".. మరేమో.. మరేమో.. మానాన్న మమ్మల్ని తగిలేసేడు.." యిద్దరూ ఒకే గొంతుగా పలికేరు.

ఇద్దర్నీ.. యింట్లోకి తీసుకొచ్చింది. దీపంబుడ్డీ వెలిగించింది. దగ్గరగా కూర్చొని - వారికి అనునయిస్తుంటే ఆశీర్వాదం మేస్టారొచ్చేరు.

".. అమ్మా, గవురమ్మా.. మరి, మా అమ్మాయి.. పోటీ చెయ్యదు. చెయ్యనివ్వను. ఆళ్లతోటి.. వేగలేను! సరస్వతినే నిలబెట్టు.." యే కారణం చేతనో మాస్టారు భయపడుతున్నారు.

గవిరికి లీలగా యేదో అర్థయయ్యింది.

".. మేస్టుగోరో..! మీరెరగని తల్లీ, కూతుళ్లం కాము మేము. ఒకరి సంపాదన కాశపడో, ఒకడి బెదిరింపులికి జడిసిపోయో.. గంగిరెద్దుల్లాగ తలలూపటం మా కలవాటు లేదు. ఆడు, అల్లుడు కాదు..! ఆడు యెవుల్ని జడిపించగల్డోగాని, మమ్మల్ని గాదు.

ఇప్పుడికే ఒక కూతుర్నిచ్చే.. యింత అక్రమానం అనుబగించేను. ఇంకా.. మరొక కూతుర్నిస్తానా ? అసలాడి గాలి, యిదిగిదిగీ మనవరాళ్ల మీదకీ రానీను. మాకొద్దు ఆడి పదవులూ వొద్దు.. ఆడిపంచలూ వొద్దు. ఆడి మర్యాద మీద ఆడున్నాడా మంచిదే! లేకపోతే.. ఆడికోనాకో నూకలు సెల్లిపోతాయి భూమ్మీద! అఁ .." గవిరి దీపం బుడ్డీ వెలుగులో.. యెర్రగా మండుతున్న కొలిమిలా కన్పిస్తోంది.

ఆశీర్వాదం మేస్టారు. చేతులెత్తి శలవు తీసుకున్నాడు. ఆ కొస యింట్లోంచి గడ్డెమ్మ గొంతు.. గట్టిగా విన్పిస్తోంది.

"...సారా వొండినోళ్ల నొదిలిసి గండలు.. మా యిళ్ల మీద పడతారేటి? ఆళ బుర్రలు పేలిపోను.." గడ్డెమ్మ శాపనార్థాలు ఇందిరా నగర్ కాలనీ అంతటికీ విన్పిస్తున్నాయి!

*(ఆహ్వానం మార్చి 1997)*